ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 3 అక్టోబరు 2024





మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అహింసా మార్గాన్ని నిర్దేశించిన మహనీయుడు గాంధీ

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 2: మహాత్మాగాంధీ ప్రపంచంలోని ప్రతి దేశానికి అహింసా మార్గాన్ని నిర్దేశించిన మహానాయకుడని, ఆయన అడుగుజాడలు, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి మంత్రితో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి దేశానికి అహింసా మార్గాన్ని నిర్దేశించిన మహానాయకుడు మహాత్మా గాంధీ అనుసరించిన అహింస, సత్యం, సత్యాగ్రహ మార్గాలతో శాంతి అహింసలను చాటిన మహనీయుడు అన్నారు. మహాత్మాగాంధీ చూపించిన బాటలోనే ప్రజలందరూ నడవాలని, అహింసను, సత్యమార్గాన్ని జీవితంలో అవలంభించాలని సూచించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని గ్రామ స్వరాజ్యమే దేశ అభివృద్ధికి మూల కారణమని మహాత్ముడు చాటాడన్నారు. జాతిపిత ఆదర్శాలను ఆదర్శంగా తీసుకున్న ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను అమలు చేస్తూ దేశాన్ని, రాష్ట్రాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారన్నారు. పౌరులందరూ కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై స్వచ్ఛ పట్టణాలు, గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి స్వచ్ఛతా హీ సేవా పురస్కారం



రాజంపేట, అక్టోబరు 2: స్వచ్ఛతా హీ సేవా పురస్కారాన్ని రాజంపేట మండలం కూచివారి పల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈటమార్పురం నరసింహులు గాంధీజయంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్రంలో 17 మందిని ఎంపిక చేయగా అందులో 8 మంది సర్పంచ్‌లు, ఇద్దరు డ్వాక్రా మహిళలు, ముగ్గురు సఫాయిమిత్ర సభ్యులు, ఒక ఎంపీడీవో, ఒక ఈవోపీఆర్డీకి, ఒక పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. అన్నమయ్య జిల్లాలో చిన్నమండెం మండలం మల్లూరు గ్రామ సర్పంచ్ దేవపట్ల నజీర్‌బాషాతో పాటు కూచివారిపల్లె కార్యదర్శి నరసింహులుకు ఈ పురస్కారం లభించింది. కూచివారిపల్లె పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంలోను, తాగునీటి వ్యవస్థను మెరుగుపరచడంలోను, చెట్ల పెంపకం, అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడంలో మొదటివరుసలో కూచివారిపల్లెను చేర్చినందుకు నరసింహులు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. కాగా కూచివారిపల్లె గ్రామ పంచాయతీలో శానిటరీ వర్కర్ నాగరాజుకు సఫాయిమిత్ర పురస్కారం లభించింది.

రూ.90కి చేరిన టమోటా ధరలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: మదనపల్లె టమోటా మార్కెట్‌లో టమోటా ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. మూడు రోజులుగా మొదటి రకం టమోటా గరిష్టంగా కిలో రూ.64 పలుకగా, బుధవారం ఒక్కసారిగా రూ.90కు చేరుకుంది. మదనపల్లె మార్కెట్‌కు నిత్యం 100 నుంచి 130 టన్నుల టమోటా విక్రయానికి వస్తుండగా బుధవారం కేవలం 84 టన్నుల టమోటా మాత్రమే విక్రయానికి వచ్చింది. దీంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి టమోటా ధరలు అమాంతం పెరిగాయి. మొదటి రకం టమోటా గరిష్టంగా కిలో రూ.90 పలుకగా, కనిష్టంగా రూ.82 పలికింది. రెండో రకం టమోటా కిలో గరిష్టంగా రూ.80 పలుకగా కనిష్టంగా రూ.70 ధర పలికింది.



మద్యం షాపులకు నోటిఫికేషన్





మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

● జిల్లాలో మొత్తం 111 షాపులు ● 8 స్టేషన్లలో ఎక్కడైనా దరఖాస్తుకు అవకాశం ● రాయచోటి స్టేషన్ పరిధిలో 23.. మదనపల్లె స్టేషన్ పరిధిలో 22 దుకాణాలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీతో అన్నమయ్య జిల్లాలో 111 ప్రైవేటు మద్యం షాపులకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెట్టారు. అలాగే ఈనెల 11వ తేదీ ఆన్‌లైన్ ద్వారా లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించనున్నారు. జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌లకు గాను అత్యధికంగా మదనపల్లె, రాయచోటి స్టేషన్ పరిధిలో 22 మద్యం దుకాణాలు తెరవనున్నారు.

దరఖాస్తుల కోసం ఆరాటం

నూతన మద్యం పాలసీ అమలులో భాగంగా మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఈఎస్ మధుసూదనరావు కలసి జిల్లాలో 111 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో భాగంగా తొలిరోజైన బుధవారం అమావాస్య అయినా చాలా మంది ఎక్సైజ్ స్టేషన్‌లకు వచ్చి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుని వెళ్లారు. నిబంధనల ప్రకారం ఎవరైనా ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో జిల్లాలో చాలా మంది మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

రూ.2 లక్షల రుసుం

మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షల రుసుం కట్టి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జనాభా ప్రాతిపదికన దుకాణాలకు (రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్) లైసెన్సు ఫీజులు నిర్ణయించారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, రూరల్ ప్రాంతాల్లో 50 వేలలోపు జనాభా ఉంటే ఏడాదికి రూ.55 లక్షలు, 50 వేలకు పైగా 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.65 లక్షల లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో లాటరీ పద్ధతిలో దుకాణం కేటాయించిన వారికే లైసెన్సులు మంజూరు చేస్తారు. లాటరీ దక్కని వారికి ఎంట్రీ రుసుం రూ.2 లక్షలు వాపసు ఇవ్వరు. రెండేళ్ల పాటు ఇచ్చే లైసెన్సులో మొదటి ఏడాదికి రూ.65 లక్షలు, రెండో ఏడాదికి 10 శాతం అదనంగా అంటే రూ.71.50 లక్షలు లైసెన్సు ఫీజులు చెల్లించాలి.



ఎక్కడైనా దుకాణాల ఏర్పాటుకు అవకాశం

నూతన ఎక్సైజ్ పాలసీ విధానం ప్రకారం మున్సిపాలిటీలు, రూరల్ ప్రాంతాల్లో లైసెన్సులు దక్కించుకున్న ఎవరైనా ఏ ప్రాంతంలో అయినా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. గతంలో జనాభా ప్రాతిపదికన ఎన్నికల వార్డులకు అనుసంధానంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయించారు. ఇప్పుడు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఎక్కడైనా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కాకుంటే దేవదాయ శాఖచే గుర్తింపు పొందిన గుడి, బడి, ఆస్పత్రులకు 200 మీటర్ల దూరం లోపల మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. అలాగే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జాతీయ రహదారి పక్కనే మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఉండదు.

మదనపల్లె, రాయచోటికి అత్యధిక దుకాణాలు

జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌లు ఉండగా మదనపల్లె, రాయచోటి ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో అత్యధికంగా మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. రాయచోటి స్టేషన్ పరిధిలో 23 దుకాణాలు, రాజంపేట స్టేషన్ పరిధిలో 20 దుకాణాలు, రైల్వేకోడూరు స్టేషన్ పరిధిలో 19 దుకాణాలు, మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 22 దుకాణాలు, ములకలచెరువు స్టేషన్ పరిధిలో 9, వాల్మీకిపురం స్టేషన్ పరిధిలో 9, పీలేరు స్టేషన్ పరిధిలో 9 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో ఎవరైనా ఏ స్టేషన్ నుంచైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో రాజకీయ నాయకుల బలవంతపు ఒత్తిడులు గురయ్యే ప్రమాదం లేదు.

12 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం

కలెక్టర్ విడుదల చేసి షెడ్యూల్ ప్రకారం ఈనెల 1వ తేది నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు ఇచ్చేందుకు గడువు విధించారు. 10వ తేదీ దరఖాస్తుల పరిశీలన, 11వ తేదీ కలెక్టర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయిస్తారు. అదేరోజు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 12వ తేదీ నుంచి కొత్త దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. లైసెన్సులు పొందిన యజమానులు వారికి అవసరమైన మద్యం రకాలను ఇండెంట్ పెట్టి, దీనికి సరిపడా సొమ్ములు చెల్లిస్తే ఐఎంఎల్ డిపో నుంచి ఆయా దుకాణాలకు మద్యం రవాణా చేస్తారు. అలాగే మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూమ్‌లను కూడా రూ.5 లక్షలు అదనంతో చెల్లించి ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.

20 శాతం మార్జిన్‌తో పెరుగుతున్న పోటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణదారులకు 20 శాతం లాభం ఇవ్వనుంది. ఇందులో ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌కు 20 శాతం, ఫారిన్ లిక్కర్‌కు 20 శాతం, బీర్లకు 20 శాతం, వైన్‌లకు 20 శాతం, రెడీ టు డ్రింక్ వెరైటీలకు కూడా 20 శాతం మార్జిన్ (లాభం) ఇవ్వనున్నారు. దీంతో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ఎక్కువగా పోటీ పడనున్నట్లు తెలుస్తోంది.

దసరా ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



అమ్మవారిశాల వీధిలో వేసిన చలువపందిళ్లు

రాజంపేట టౌన్, అక్టోబరు 2: రాజంపేటలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిశాలలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. రాజంపేట పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. చుట్టూ అందమైన చలువ పందిళ్ల, స్వాగత తోరణాలు, అమ్మవారి ప్రతిమలు, భారీ విద్యుద్దీపాలంకరణ చేశారు. పట్టణంలోని చౌడేశ్వరిదేవాలయం, సాధుకామాక్షమ్మ ఆలయం, మన్నూరు ఉదయగిరి ఎల్లమ్మ ఆలయం, వెంకటరాజంపేటలోని కనకదుర్గ ఉమామహేశ్వరాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

గురువారం నుంచి రాజంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం దీక్షాబంధన అలంకారం, 4న బిల్వవృక్ష అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారు. 5న అన్నపూర్ణదేవి అలంకారం, 6న కృష్ణమూర్తి అలంకారం, 7న మోహినిదేవి అలంకారం, 8న మీనాక్షిదేవి అలంకారం, 9న సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిస్తారు. 10న మహిషాసురమర్దిని అలంకారం, 11న మహాలక్ష్మీదేవి అలంకారం, 12న రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారు.



అందంగా ముస్తాబైన రాజంపేట అమ్మవారిశాల ముఖద్వారం



టీడీపీలో చేరనున్న జడ్జి రామకృష్ణ

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: బి.కొత్తకోటకు చెందిన జడ్జి రామకృష్ణ త్వరలో టీడీపీలో చేరనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉండవల్లిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను జడ్జి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలపై న్యాయపరంగా జడ్జి చేసిన పోరాటాలు తదితర విషయాలను చర్చించినట్లు తెలిపారు. అంతేకాకుండా తన జడ్జి పదవికి రాజీనామా చేసి పూర్తి స్థాయిలో టీడీపీలో క్రియాశీలకంగా పనిచేయాలని నిర్ణయించుకుంటున్నట్లు జడ్జి ఆ ప్రకటనలో వెల్లడించారు.

హంద్రీ-నీవా విస్తరణపై ఆశలు

● రూ.1030 కోట్లతో విస్తరణకు 2014లో టీడీపీ శ్రీకారం
● వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవినీతి పేరుతో రద్దు
● రూ.6182.19 కోట్లతో రీటెండర్లు
● రెండున్నరేళ్లలో గంపెడు మట్టి కూడా తీయలేదు
● మళ్లీ టీడీపీ కూటమి రావడంతో విస్తరణపై దృష్టి
● మాల్యాల నుంచి కుప్పం వరకు రూ.1920 కోట్లతో ప్రణాళిక



కర్నూలు జిల్లా పత్తికొండ సమీపంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ దుస్థితి



హంద్రీ-నీవా ప్రాజెక్టు ప్రధాన మల్యాల పంపింగ్ స్టేషన్

కర్నూలు, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): 'హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులు చేస్తారా..!' రాయలసీమ కరువు రైతులను వేధిస్తున్న ప్రశ్న. ఏటేటా వేల టీఎంసీల కృష్ణా జలాలు కడలి పాలవుతున్నా కరువు రైతుల కన్నీళ్లు తుడవలేని పరిస్థితి. ఈ పరిస్థితి మార్చడానికి రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు రూ.1030 కోట్లతో తొలి దశ కాలువ విస్తరణ పనులు చేపట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులకు అవినీతి ముసుగేసి రద్దు చేసింది. మళ్లీ రూ.6182.19 కోట్లతో టెండర్లు పిలిచారు. పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో కాంట్రాక్ట్ దక్కించుకున్న బడా సంస్థలు రెండున్నరేళ్లు దాటినా గంపెడు మట్టి కూడా తీయలేదు. మళ్లీ కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా విస్తరణపై దృష్టి సారించింది. మాల్యాల నుంచి కుప్పం వరకు విస్తరించేందుకు రూ.1920 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పనులు మొదలు పెట్టి జూలై ఆఖరులోగా పూర్తి చేసే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో హంద్రీ-నీవా కాలువ, జలాశయాలను రెండు రోజులు పరిశీలించడంతో విస్తరణపై ఆశలు చిగురిస్తున్నాయి.

సుజల స్రవంతి పథకమిది...

రాయలసీమ కరువు రైతుల జీవనాడి హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం. శ్రీశైలం జలాశయం ఎగువన నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలను ఎత్తిపోసి కరువు నేలకు మళ్లించేలా హంద్రీ-నీవా ప్రాజెక్టు చేపట్టారు. తొలి దశ (ఫేజ్-1) కింద కర్నూలు జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, 8 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 3850 క్యూసెక్కులు ఎత్తి పోసేందుకు వీలుగా హైడ్రాలికల్ పర్టిక్యూలర్స్ ప్రకారం ప్రధాన కాలువ 9.5 మీటర్లు బెడ్ విడ్త్ (కాలువ అడుగు బాగం వెడల్పు)తో నిర్మించాలి. సీసీ లైనింగ్ చేస్తే 12 పంపులు ద్వారా 3850 క్యూసెక్కులు (ఒక్కో పంపు ద్వారా 330 క్యూసెక్కులు) లిఫ్ట్ చేసేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం 5-6 పంపుల ద్వారా 1940 క్యూసెక్కులకు మించి ఎత్తిపోసుకోలేని పరిస్థితి. 3850 క్యూసెక్కులు ఎత్తిపోస్తే ఆరు నెలల్లో ఎంత తక్కువ కాదన్నా 60 టీఎంసీలు తీసుకుని నిల్వ చేస్తే.. కరువు సీమను సస్యశ్యామలం చేయవచ్చు.

> **ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం..**
>
> హంద్రీ-నీవా కాలువ విస్తరణ కోసం ఫేజ్-1 పరిధిలో బ్యాలెన్స్ పనులు రూ.870 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ఫేజ్-2లో భాగంగా 216.30 కి.మీల నుంచి 565కి.మీల వరకు విస్తరణకు రూ.1,050 కోట్లతో అంచనాలు సిద్ధం చేశాం. రెండు రోజుల్లో ప్రభుత్వానికి పంపుతాం. వచ్చే ఏప్రిల్‌లో పనులు మొదలు పెట్టి జూలై ఆఖరులోగా పూర్తి చేసేలా ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు వెళ్తోంది. విస్తరణ పనులు పూర్తి చేస్తే నెలకు 10 టీఎంసీలు... ఆరు నెలల్లో 60 టీఎంసీలు తీసుకునే అవకాశం ఉంది.
>
> - నాగరాజు, హంద్రీ-నీవా ప్రాజెక్టు సీఈ, అనంతపురం జిల్లా

టీడీపీ హయాంలో విస్తరణకు శ్రీకారం

రైతుల కన్నీటి' కష్టాలు తీరుతాయనే ఆశయంతో గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు రూ.1030 కోట్లతో కాలువ విస్తరణ పనులను నాలుగు ప్యాకేజీలుగా మొదలు పెట్టి రూ.285.77 కోట్ల పనిచేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేసి ఉంటే ఇప్పటికే విస్తరణ పూర్తయి పూర్తి స్థాయి సామర్థ్యంలో కృష్ణా జలాలు తీసుకునే అవకాశం ఉండేది. అయితే టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తి చేస్తే ఆ మంచి పేరు చంద్రబాబుకు వస్తుందనే రాజకీయ దురుద్దేశంతో 2019 మే నెలలో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం ఆ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయంటూ విస్తరణ పనులు రద్దు చేశారు. ఇది సీమ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

జగన్‌ది టెండర్ల ఆర్భాటమే..

హంద్రీ-నీవా కాలువను విస్తరిస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసిందే తప్ప రెండున్నరేళ్లలో గంపెడు మట్టి కూడా తీయలేదు. ప్రధాన కాలువ విస్తరణతో పాటు 8 పంపింగ్ స్టేషన్ల దగ్గర అదనంగా 2,450 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు అదనపు పంపుల ఏర్పాటు కోసం రూ.6,182.19 కోట్లు మంజూరు చేస్తూ 2021 సెప్టెంబరు 15న గత వైసీపీ ప్రభుత్వం సాంకేతిక అనుమతులు ఇచ్చింది. 36 నెలల్లో పనులు పూర్తి చేస్తామంటూ అగ్రిమెంట్ చేసుకున్న పెద్ద కంపెనీలు పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో గంపెడు మట్టి కూడా తీయలేదు. విస్తరణపై గత వైసీపీ పాలకులు చిత్తశుద్ధి చూపలేదు. దీంతో హంద్రీ-నీవా కాలువ విస్తరణ ప్రశ్నార్థకంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఫేజ్-2 కింద అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 26 టీఎంసీలు వినియోగించుకుని 4.05 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా.. 216.300 నుంచి 565 కి.మీల వరకు... 349 కి.మీలు ప్రధాన కాలువ, శ్రీసత్యసాయి జిల్లాలో గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల జలాశయాలు, అన్నమయ్య జిల్లాలో శ్రీనివాసపురం, చిత్తూరు జిల్లాలో అడవిపల్లి జలాశయాలు చేపట్టారు. రూ.5,602.36 కోట్లతో చేపడితే ఇప్పటికే రూ.2,998.63 కోట్లకు పైగా ఖర్చు చేశారు. 53.52 శాతం పనులు చేశారు. గత జగన్ ప్రభుత్వంలో ఒక్క పైసా నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు

తుంగభద్ర, కృష్ణాకు ఈ ఏడాది వరద పోటెత్తింది. శ్రీశైలం జలాశయానికి 1150 టీఎంసీలకు పైగా వరద చేరింది. రాయలసీమ ప్రాజెక్టు ద్వారా వంద టీఎంసీలు కూడా తీసుకోలేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణం సరైన కాలువలు, జలాశయాలు లేకపోవడమే. సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువ విస్తరణపై మళ్లీ దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన టెండర్లు రద్దు చేసినట్లు సమాచారం. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వంలో 3,850 క్యూసెక్కులు తీసుకోవడానికి వీలుగా ఫేజ్-1 కింద 216.30 కి.మీలు ప్రధాన కాలువ విస్తరణ పనులు గత టీడీపీ ప్రభుత్వం రూ.1030 కోట్లతో చేపట్టి రూ.285.77 కోట్లు ఖర్చు చేసిన విషయం తెలిసిందే. ఈ బ్యాలెన్స్ పనులు, ఫేజ్-2 (రెండో దశ) కింద 349 కి.మీలు ప్రధాన కాలువ విస్తరణకు కలిపి రూ.1,920 కోట్లతో హంద్రీ నీవా ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఫేజ్-1 ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఫేజ్-2 ప్రతిపాదనలు రెండు రోజుల్లో పంపుతామని ఇంజనీర్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఆరంభం నాటికి టెక్నికల్, పరిపాలన అనుమతులు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు.

అసంపూర్తిగా పత్తికొండ జలాశయం



రబీకి 'వెలిగల్లు' నీరు అందేనా?

- ప్రాజెక్టు నీటి కోసం రైతుల ఎదురు చూపులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 2: రబీ సీజన్‌లో వెలిగల్లు నీరు అందుతాయా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో కరువు కాటేసింది. మండలంలో గట్టిగా ఒక్క పదును వర్షం కూడా కురవలేదు. రైతులు మాత్రం ఖరీఫ్ పంటలు సాగుచేసేందుకు అప్పుసప్పో చేసి తెచ్చుకున్న విత్తనాలను సిద్ధం చేశారు. మరి కొందరు వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో వేరుశనగ పంట సాగుచేశారు. మరి కొంతమంది బోర్ల కింద పంటలు సాగు చేశారు. సెప్టెంబరు మాసం పూర్తి కావస్తున్నా ఇంతవరకు పదును వర్షం పడలేదు. సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. మరి కొంతమంది ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు చేసి పంటలను కాపాడుకుంటున్నారు. దీంతో ఈ ఏడాది రబీ పంటలకైనా వెలిగల్లు ప్రాజెక్టు నీరు అందుతుందా.. లేదా అని రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు.



సాగు చేయడానికి సిద్ధంగా ఉన్న వరినారు



వెలుగల్లు ప్రాజెక్టు కుడికాలువ

లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు వెలిగల్లు ప్రాజెక్టు పట్టుకొమ్మ లాంటిది. అలాంటి ప్రాజెక్టులో నీరు తగ్గుముఖం పట్టింది. ఈ ప్రాజెక్టు నుంచి ఇప్పటికీ రాయచోటి పట్టణానికి మంచి నీటిని అందిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు మండలంలోకి వెలిగల్లు నీరు చేరలేదు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె రైతులు కోటి ఆశలతో వెలిగల్లు ప్రాజెక్టు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. బోరు, చెరువుల కింద వరినారు, వేరుశనగపంట సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ రెండు మండలాలకు ఎలాంటి నీటి ఆదరువు లేదు. కేవలం వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగుచేసుకోవాలి. అంతో ఇంతో వెలిగల్లు ప్రాజెక్టు నీరే ఆధారం. ఈ ఏడాది అది కూడా దక్కేలా లేదని రైతులు నిరుత్సాహ పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఏడాది నుంచి తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నీరు చెరువులకు వదిలితే అటు తాగునీటితో పాటు బోర్లల్లోకి నీరు వస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది పూర్తిగా కరువు మండలంగా ప్రకటించారు. ఈ ఏడాది వెలిగల్లు ప్రాజెక్టు నీరు ఈ రెండు మండలాలకు రాకపోతే పూర్తి స్థాయిలో ఇబ్బందులు పడాల్సిందే. వెలిగల్లు కాలువ ద్వారా నీరు చెరువులకు వస్తుందని కుర్నూతల, పందిళ్లపల్లె, కస్తూరిరాజుగారిపల్లె, మద్దిరేవుల, దప్పేపల్లె, కోనంపట, దిన్నెపాడు గ్రామాల రైతులు వరినార్లు పోసి నాటడానికి సిద్ధంగా ఉన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నీరు ఇంతవరకు మండలం అంచుల వరకు రాలేదు. ప్రాజెక్టు నీళ్లు చెరువులకు ఎప్పుడు వస్తాయోనని రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు నీళ్లు వదులుతారని ఇప్పటికే కొందరు రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. ఏదేమైనా వెలిగల్లు ప్రాజెక్టు నీరు రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు వదలాలని రైతులు కోరుతున్నారు.

చెరువుకు నీళ్లు వస్తే..



వెలుగల్లు ప్రాజెక్టు నీరు కాలువల ద్వారా జీనగవాయిలచెరువుకు వస్తే వరి పంట సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నా. బోరులో ఉన్న నీటిని నమ్ముకొని వరినారు పోశాను. వదిలేస్తాము అనుకున్న సమయంలో వెలుగల్లు ప్రాజెక్టుకు నీరు వదిలారు అంటున్నారు. ఆ నీరు జీనగవాయిలచెరువుకు వస్తే వరిపంట సాగు చేస్తా.

- నాగరాజు, ఎగువవడ్డెపల్లె, కుర్నూతల

బోర్లలోకి నీరు చేరుతుంది



రెండేళ్లుగా సక్రమంగా వర్షాలు కురవక బోర్లలో ఉన్న నీళ్లు ఎండిపోతున్నాయి. రెండు బోర్లు వేశాను. వర్షాలు కురవక ఒక బోరు ఎండిపోయింది. రెండవ బోరు కింద వంగతోట, వరి పంట సాగు చేశాను. వెలుగల్లు నీరు వస్తే బోర్లలో నీరు వస్తుంది. దీంతో ఈ ఏడాది అంతో ఇంతో బయట పడవచ్చు అనుకుంటున్నా.

- పీరయ్య, దిన్నెపాడు



రబీలో సాగు చేసేందుకు భూములు దుక్కులు చేసిన దృశ్యం



వర్షాలు లేక ఎండిపోతున్న మామిడి చెట్లు

ముగిసిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

రాజంపేట, అక్టోబరు 2: రాజంపేటలో 2 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి 11 జిల్లాల నుంచి క్రీడాకారులు నువ్వా నేనా అన్నరీతిలో తలపడ్డారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమరాజు, భానుమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

చక్రాయపేట, అక్టోబరు 2: మండలంలోని మారెళ్లమడక గ్రామం కొండావాండ్లపల్లెకు చెందిన రమాదేవి (28) కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రమాదేవికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం రాత్రి అందరూ మిద్దెపై నిద్రిస్తూ ఉండగా బాత్రూమ్‌కు కిందకు వచ్చింది. అనంతరం ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

కడప(స్పోర్ట్స్), అక్టోబరు 2: కడపలో ఈ నెల 4న శుక్రవారం నుంచి 23వ తేది వరకు ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీ డే 2 రోజుల క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. నగర రిమ్స్ సమీప వై.యస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంతో పాటు నగర శివారు ప్రాంతమైన కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో మ్యాచ్‌లు జరుగనున్నట్లు వెల్లడించారు. ఇందులో చిత్తూరు- కర్నూలు- విశాఖపట్నం- ప్రకాశం- కడప- వెస్ట్ గోదావరి- ఈస్ట్ గోదావరి, జిల్లాల క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 2: మదనపల్లెలో బుధవారం నుంచి ఈ నెల 11 వరకు దసరా మహోత్సవాలు పలు ఆలయాల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓం ప్రకాష్, ఆర్యవైశ్య అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలు, అర్చనలు, విశేష పూజలు, అన్నదానం నిర్వహిస్తామన్నారు. స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో బుధవారం నుంచి దసరా ఉత్స వాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రామిశెట్టి రత్న మయ్య, ట్రెజరర్ తెలిపారు. విద్యుత్ అలంకరణలతో ఆల యం శోభాయానుమానంగా అలంకరించారు. కోర్టు ఆవరణలో వెలిసిన కోర్టులో గంగమ్మకు విజయదశమి పురస్క రించుకుని దేవీ నవరాత్రుల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేవసినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. దేవతానగర్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో దసరా సందర్భంగా విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పతాంజలిస్వామి తెలిపారు. స్థానిక అనపగుట్టలోని అభయ లక్ష్మీనరసింహ ఆలయంలో అమ్మవారికి దసరా సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు రమేష్ తెలిపారు. నేటి నుంచి 12 వరకు పూజలు ఉంటాయన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 2: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, కోళ్లబైలు గ్రామం, జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారిని తమ ఇంటి ముందర వెంకటేష్‌తో కలిసి గత నెల 29 శనివారం ఉదయం బైక్‌పై పుంగనూరు రోడ్డులో స్వామివద్దకు వైద్యం కోసం అని తీసుకెళ్లారన్నారు. ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదని, కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకి తెలిసిన వారు సీఐ తాలుకా 9440796742, ఎస్ఐ నెంబర్ 9440796743కు ఫోన్ చేయాలని సూచించారు.



అదృశ్యమైన స్వర్ణకుమారి

గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేస్తాం

- వెలిగల్లు ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం
- త్వరలో గ్రామాలకు రోళ్లమడుగు తాగునీరు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- స్వచ్ఛతా హీ సేవలో జిల్లాకు ఉత్తమ అవార్డు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 2: రాయచోటి నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు పటిష్ఠంగా నిర్వహించిన లక్కిరెడ్డిపల్లెలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో గ్రామ సర్పంచ్ అహల్య అధ్యక్షతన ప్రజాదర్బార్ ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ హాజరయ్యారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 750 గ్రామ పంచాయతీలలో జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ స్వచ్ఛతా హీ సేవా అవార్డుకు ఎంపిక కావడం మన అదృష్టం అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వరదలు ప్రజలను ఇబ్బందులు పెడుతుంటే అన్నమయ్య జిల్లాల్లో వర్షాలు కురవక సాగు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి కోసం నియోజకవర్గంలో ఇప్పటికే 100 మంచినీటి బోర్లు వేశామన్నారు. ఈ ఏడాది కరువు వచ్చింది మామిడి తోటలు నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉందని దీనికి ఒక ప్రణాళిక తయారు చేసి మామిడి రైతులను ఆదుకుంటామన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల చెరువులకు నీరు నింపి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, అలాగే లక్కిరెడ్డిపల్లె మండలంలో తాగునీటి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరలో రోళ్లమడుగు నీటిని ప్రతి గ్రామానికి అందిస్తామని తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో గ్రామ పంచాయతీలకు జరిగిన గ్రామ సభలకు 1.20 కోట్ల మంది ప్రజలు హాజరయ్యారని, సఫాయిమిత్రలు, గ్రామ సర్పంచులు గ్రామాల పరిశుభ్రతకు సహకరించారని తెలిపారు. జిల్లాకు సఫారీ కర్మచారి అవార్డు దక్కడం చాలా గర్వకారణమన్నారు. ప్రస్తుతం జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 కోట్లు వచ్చాయని, పదిరోజుల్లో మరో 30 కోట్ల రూపాయలు జిల్లాకు వస్తాయని ఈ నిధులు 30 శాతం వ్యర్థ పదార్థాల నిర్వహణకు, క్లబ్ ప్రోగ్రాంకు ఉపయోగపడతాయని తెలిపారు. మంత్రి సూచనల మేరకు కామన్‌గుడ్ ఫండ్ ద్వారా 2.50 కోట్ల రూపాయలు బోర్‌వెల్స్‌కు మంజూరు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మండలం టీడీపీ నాయకుడు మదన్‌మోహన్, అనంతరం 75 ఏళ్లు పైబడిన వృద్ధులను మంత్రి, కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్వతి, తహసీల్దార్ లక్ష్మిప్రసన్న, ఎంపీడీవో పట్నాయక్, సీడీపీవో పద్మావతి, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి గుణశేఖర్‌పిళ్లై, మండల నాయకుడు మదన్‌మోహన్, టీడీపీ నాయకులు కొండూరు వెంకటరామరాజు, డాక్టర్ షఫీనాయక్, జయరాం, ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెయ్యయాదవ్, పాపయ్య, జేకే రెడ్డి, ముక్తార్, అంజద్‌బాషా, సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

ఆర్థిక లావాదేవీలా... వివాహేతర సంబంధమా..?

● కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి కేసులో ఎన్నో అనుమానాలు

పెండ్లిమర్రి, అక్టోబరు 2: కడప-పులివెందుల ప్రధాన రహదారిలో యోగివేమన యూనివర్సిటీ వద్ద సోమవారం అర్ధరాత్రి కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి రోడ్డు ప్రమాదంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలా లేక వివాహేతర సంబంధమా అనేది తెలియడం లేదు. సంఘటన జరిగిన వెంటనే వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్‌కు తెలిపాడు. మొదట రోడ్డు ప్రమాదం జరిగినట్లు కథ నడపాలని చూశారు. అయితే అక్కడ రోడ్డు ప్రమాదం జరిగినట్టు ఎలాంటి ఆనవాళ్లు లేవు. కానిస్టేబుల్ బంధువులు కూడా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. శ్రీనివాస్‌రెడ్డి వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని సమాచారం. అలాగే వేరే మహిళతో వివాహేతర సంబంధం కూడా కొనసాగిస్తున్నాడని తెలిసింది. వివిధ అసాంఘిక కార్యకలాపాల్లో కూడా ఈ కానిస్టేబుల్ ప్రమేయం ఉన్నట్లు చెబుతున్నారు. సంఘటన స్థలంలో రంపం కూడా దొరికినట్లు సమాచారం. కానిస్టేబుల్‌కు మండలంలోని మమ్ముసిద్ధపల్లె గ్రామంలో బంధుత్వం ఉంది. వివిధ రకాల వ్యక్తులను పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు అక్కడికి వెళ్లి విచారణ చేస్తున్నారు. వారికి కానిస్టేబుల్ సహకరించడం లేదని తెలిసింది.

రెండు బైకులకు నిప్పంటించిన దుండగులు

కడప(క్రైం), అక్టోబరు 2: కడప నగరం మాసాపేటలో రెండు ద్విచక్ర వాహనాలకు గుర్తు తెలియని దుండగులు నిప్పటించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ హుసేన్ వివరాల మేరకు.. కడప మాసాపేటకు చెందిన వరప్రసాద్ ఎర్రముక్కపల్లెలోని ఓ ప్రైవేటు స్కూలులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పల్సర్, హోండా యాక్టివా బైకులు ఇంటి కాంపౌండులో పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు బైకులకు నిప్పంటిం చడంతో పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారిస్తున్నామన్నారు.

మోటారు బైక్‌ల దొంగ అరెస్టు

● 9 హోండా షైన్ మోటారు బైక్‌లు స్వాధీనం

ప్రొద్దుటూరు, అక్టోబరు 2: కష్టపడకుండానే సులభంగాడబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో మోటారు బైక్‌లు దొంగతనం చేసి వాటిని బెంగుళూరులో విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకున్న దొంగ ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కడప జిల్లా బ్రహ్మంగారి మఠంకు చెందిన సోమిరెడ్డిపల్లె లాజరయ్య అలియాస్ ఓబులేసు అనే వ్యక్తి ప్రొద్దుటూరులోని పట్టణంలో పలుప్రాంతాల్లో పార్కింగ్ చేసిన మోటారు బైక్‌లను నకిలీ తాళం చెవి సహాయంతో లాక్‌తీసి వాటిని చోరీ చేసేవాడు. బ్రహ్మంగారిమఠంలోని అతని ఇంటి దగ్గరలో ఉన్న కంపచెట్లలో వాటిని దాచి వాటిపై ప్లాస్టిక్ పట్టను కప్పి ఉంచి వాటిని బెంగుళూరులో విక్రయించి సొమ్ముచేసుకోవాలని నిర్ణయించుకున్నాడు రాబడిన సమాచారం మేరకు ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐలు రాఘవేంద్రారెడ్డి ధనుంజయనాయుడు సిబ్బంది రవీంద్రనాయక్ రామాంజనేయులు కలిసి మడూరు రోడ్డులోని ప్రకాష్‌నగర్‌కు పోయే క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమిరెడ్డి లాజరయ్య అలియాస్ ఓబులేసును అరెస్టు చేసి అతని వద్ద వున్న సుమారు రూ.7 లక్షల విలువ చేసే 9 హోండా షైన్ మోటారు బైకులు, మరో డ్రీమ్ నియో మోటారు బైక్‌ను మొత్తం పది మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు వెల్లడించారు.



మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కార్ల మోసాలకు పాల్పడిన ఇరువురు అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప(క్రైం), అక్టోబరు 2: కార్లను అద్దె పేరుతో తీసుకుని.. తర్వాత అద్దె చెల్లించకుండా.. కార్లు ఇవ్వకుండా ఇతరులకు కుదువ పెట్టి మోసాలకు పాల్పడిన ఇరువురు మోసగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్, తాలుకా సీఐ వెంకటేశ్వర్లతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బుధవారం నిందితుల వివరాలు వెల్లడించారు. కడప నబీకోటకు చెందిన నిమ్మకాయల వెంకటశశిధర్ గతంలో కియా కార్ల షోరూంలో పనిచేస్తుండేవాడు. అక్కడ ఉద్యోగానికి రాజీనామా చేసి.. సులభంగా డబ్బులు సంపాదించాలని నబీకోటకు చెందిన షేక్ అబ్దుల్ జిలానీతో కలిసి కార్లు బాడుగకు తీసుకొని వాటిని కుదువ పెట్టి డబ్బులు వసూళ్లు చేసుకోనే వారు. కార్లు ఉన్న వారిని కలిసి అద్దెకు తీసుకుని వారికి డబ్బులు చెల్లించకుండా తిరిగి కార్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. నబీకోటలోని వీరేంద్రకు చెందిన మూడు కార్లను నెలకు రూ.30వేలు చొప్పున బాడుగకు తీసుకున్నారు. అద్దె చెల్లించక పోవడంతో వీరేంద్ర తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై తాహీర్ హుస్సేన్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇరువురు కడపకు చెందిన పలువురి వద్ద నుంచి 37 కార్లను అద్దె పేరుతో తీసుకొని.. కుదువ పెట్టి డబ్బులు వసూళ్లు చేసుకున్నారు. కార్ల యాజమానులకు బాడుగలు, కార్లు ఇవ్వకుండా మోసాలకు పాల్పడ్డారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి.. రూ.2 కోట్లు విలువ చేసే 37 కార్లు స్వాధీనం చేసుకుని.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును అతి తక్కువ సమయంలో చేధించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ

సేవలు ఎక్కువ.. వేతనాలు తక్కువ!

● ఏపీ ఎండీసీ వైద్య కేంద్రం సిబ్బంది ఆవేదన ● ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు



మంగంపేటలోనే ఏపీఎండీసీ వైద్యకేంద్రం

ఓబులవారిపల్లె, అక్టోబరు 2 : ప్రపంచాన్ని గడగడ లాడించిన కరోనా సమయంలో కూడా వైద్యసేవలు అందించాం. చాలీ చాలని వేతనాలతో బతుకు వెళ్ల దీస్తున్నాం. ఉద్యోగ భద్రతే కాదు.. కనీసం ఆరోగ్య భద్రత కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఏపీఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది వాపోతున్నారు.

ఏపీఎండీసీ ఉద్యోగులు, కార్మికులతోపాటు, డేంజర్ జోన్‌లోని కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ, కొత్తమంగంపేట, అయ్యపురెడ్డిపల్లె, మంగంపేట అగ్రహారంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల సౌకర్యార్థం మంగంపేటలో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో సుమారు 14 ఏళ్ల క్రితం ఆసుపత్రి ఏర్పాటు చేశారు. నిరంతరం వైద్య సేవలు అందుతాయన్న ఉద్దేశంతో ప్రతి రోజు 50 నుంచి 80 మందిదాకా రోగులు ఆస్పత్రిని సందర్శిస్తుంటారు. ఓబులవారిపల్లె, కోడూరు నుంచి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, బంధువులు సైతం వైద్యసేవలు పొందుతుంటారు. ఈ ఆసుపత్రిలో ఏపీఎండీసీ కార్మికులను ఎక్కువగా ప్రభావితం చేసే శ్వాసకోశ వ్యాధులతోపాటు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సైతం చికిత్స అందిస్తారు. ఈ వైద్య కేంద్రంలో అత్యాధునిక వైద్య పరికరాలతోపాటు, అత్యవసర సేవలకు అవసరమైన ప్రత్యేక వార్డులు, అంబులెన్సులు అందుబాటులో ఉంచారు. ఈ ఆసుపత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు ఇతర సిబ్బంది 27 మంది ఏళ్ల తరబడి పని చేస్తున్నారు. వీరంతా ఏపీఎండీసీ ఉన్నతస్థాయి అధికారుల పర్యవేక్షణలోనే పని చేస్తారు. అయితే, వేతనాలు మాత్రం ప్రైవేటు సంస్థ చెల్లిస్తుంది. దీంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ ప్రైవేటుకు...

ఈ ఆసుపత్రి నిర్వహణ బాధ్యతల కాంట్రాక్టును నెలకు రూ 15 లక్షలకు ఆద్య మెడికల్ సర్వీసు అనే సంస్థకు ఏపీఎండీసీ అప్పగించింది. ఈ సంస్థకు గతంలో ఎలాంటి అనుభవం లేకపోగా, గత ప్రభుత్వంలో సీఎంవోలో సలహాదారుగా పనిచేసిన ఓ వ్యక్తికి సంబంధించిందని, మంగంపేట ఏపీఎండీసీలో ముఖ్యమైన కాంట్రాక్టు పనులను ఆయనే చేజిక్కించుకునే వారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు మందుల సరఫరా బాధ్యతలను మరో కాంట్రాక్టరుకు అప్పగించడంతోపాటు నెలకు లక్ష రూపాయ లకు సరిపడా మందులను మాత్రమే మంజూరు చేస్తుండడంతో రోజూ పెద్ద ఎత్తున ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు కూడా అందించ లేని పరిస్థితి నెలకొంది. నెల చివరి రోజుల్లో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉంటుందని, ఏపీఎండీసీ అధి కారులు సమస్యను గుర్తించి అదనంగా నెలకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు మందులకు కేటాయిం చాలని సిబ్బంది కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పిస్తారనే..

ఇతర ఆసుపత్రులో పెద్ద మొత్తంలో వేతనాలు చెల్లిస్తుండగా ఇక్కడే ఎందుకు పని చేస్తున్నారన్ని ప్రశ్నించగా.. ఏపీఎండీసీ నిర్వహిస్తున్న ఆసుపత్రి కావడంతో ఏనాటికైనా ఉద్యోగ భద్రత కలుగుతుంద న్న ఆశతోనే ఇక్కడ పని చేస్తున్నామని, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వమైనా తమ సమస్యలు గుర్తించి న్యాయం చేస్తారని ఎదురుచూస్తున్నామంటున్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, నిర్వహణ బాధ్యతలను ఏపీఎండీసీ స్వీకరిం చాలని కోరుతున్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

రామాపురం, అక్టోబరు 2: మండలంలోని నీలకంఠ్రావుపేటలో ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్య తెలిపారు. ఈ నెల 3న ఉదయం మహాగణపతి పూజ, స్వస్తివాచనం, కలశస్థాపన, రక్షాబంధన అలకారం ఉంటాయన్నారు. 4న మహాలక్ష్మి, 5న అన్నపూర్ణాదేవి, 6న గజలక్ష్మి, 7న మోహిని, 8న కన్యకాపరమేశ్వరిదేవి అలంకారం, 9న బుధవారం పగలు బిందెసేవ, మూల నక్షత్రం, రాత్రి సరస్వతి అలంకారం, 10న మహిశాసుర మర్దిని, 11న శ్రీరాజ లక్ష్మిదేవి అలంకారం, 12న విజయదశమి, శమీదర్శనం, రాత్రి గ్రామోత్సవం, 13న వసంతోత్సవం ఉంటాయన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని సర్వమంగళ, రామలింగేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ,చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు బాల త్రిపురసుందరి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తుందని అర్చకులు తెలిపారు.

కార్యకర్తలకు ఇన్సూరెన్స్ చేసిన ఏకైక పార్టీ టీడీపీ

రాయచోటిటౌన్, అక్టోబరు 2: కార్యకర్తలు తమ కుటుంబం కంటే ఎక్కువగా పార్టీకి ప్రాధాన్యం ఇచ్చినట్లే, కార్యకర్తల కుటుంబ సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని, అందుకే తెలుగుదేశం ఒక పార్టీగా కాకుండా అతి పెద్ద కుటుంబంగా వర్ధిల్లుతోందని, ఆ వసుధైక కుటుంబంలో మీరు కూడా భాగస్వాములు కావాలని మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద బూత్ కమిటీలు, గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువనేత రాహుల్‌రెడ్డి, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, ఐటీడీపీ చాంపియన్ నాగభూషణ్ రెడ్డి, ధన, గణేశ్, హరి, బాబు, రాంమోహన్, శ్రీకాంత్, బాలాజీ, కసినేని మహేంద్రనాయుడు, మల్లికార్జున, అన్ని అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

3న బోరెడ్డిగారిపల్లెలో పశు చికిత్స శిబిరం

రాయచోటిటౌన్, అక్టోబరు 2: చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో ఈ నెల 3న ఉదయం 8 గంటలకు ఉచిత పశుచికిత్స శిబిరం, సంకరజాతి దూడల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలు ప్రారంభిస్తారన్నారు. పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు పాల్గొని తమ పశువులకు, జీవాలకు ఉచిత పశువైద్యసేవలు సూచనలు పొందాలని కోరారు. ఖనిజ లవణాల మిశ్రమం, మందుల పంపిణీ, ఎంపిక చేసిన దూడలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు స్థానిక అధికారులు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం దారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు మానండి: ఎంపీడీవో

చిన్నమండెం, అక్టోబరు 2: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించిన అనంతరం స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా స్థానిక దుకాణదారులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో దివ్య ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

మద్యం షాపుల్లో విక్రయ వేళలు తగ్గించండి

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 2: మద్యం విక్రయించే సమయాన్ని తగ్గించాలని సీపీఐ నాయకుడు తుమ్మల రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలలలో నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టి మధ్యతరగతి కుటుంబాలు ఏమీ తినలేని పరిస్థితి తీసుకుని రావడం దురదృష్టకరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పండుగోల మణి, దార్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు మాజీ మున్సిపల్ చైర్మన్ విగ్రహావిష్కరణ

రాయచోటిటౌన్, అక్టోబరు2: రాయచోటి మండలం మాదవరం వడ్డెపల్లిలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న రాయచోటి మాజీ మున్సిపల్ చైర్మన్ దేరంగుల వీరభద్రయ్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ రౌతు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ శంకర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రదుర్గ పీఠాధిపతి ఇమ్మడి సిద్ధిరామేశ్వరస్వామీజీ హాజరవుతున్నారని వారు తెలియజేశారు. విద్యావంతుల వేదిక నాయకులు చిన్నప్ప, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభలతోనే సమస్యల పరిష్కారం

సుండుపల్లె, అక్టోబరు2: గ్రామ సభలు కొన్ని సమస్యల పరిష్కారం అవుతాయని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శివాలయంలో గ్రామసభ నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు శివరామిరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు మాలేపాటి సురేశ్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, జనసేన నాయకురాలు రెడ్డిరాణి, శ్రీనివాసులు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద తక్షణం చేయవల్సిన పనులు ఎటువంటి పనులు చేస్తే గ్రామ ప్రజలకు అవసరం కలుగుతాయి అనే అంశాలపై స్థానిక సర్పంచ్ మునల్‌రెడ్డి, గ్రామ ప్రజలతో చర్చించి తీర్మానం చేసినట్లు ఏపీవో మాధవి తెలిపారు.

వీరబల్లి: ప్రణాళికాబద్ధంగా పనులు గుర్తించాలని మట్లి సర్పంచ్ నాగార్జునాచారి సూచించారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. మొదటగా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించి అనంతరం గ్రామ సభ నిర్వహించడం జరిగింది. రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలని ఆయన గ్రామ సభలో సూచించారు. కూలీలకు అవసరమేరా పనులు గుర్తించి వలసలు ఆపాలన్నారు. ప్రస్తుతం గుర్తించిన పనులు వివరాలు గ్రామ సభలో ఉపాధి సిబ్బంది వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామచంద్రారెడ్డి, ఏపీవో నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని బొమ్మవరం గ్రామ పంచాయతి కార్యాలయంలో ఉపాదిహామీ పథకం పనుల గుర్తింపు కొరకు గ్రామసభ నిర్వహించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు, ఉమ్మలరాజు సుబ్బరాజులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగరాజు, కార్యదర్శి బాలసుబ్రమణ్యం, సాంబశివరాజు, నరసింహరాజు, శివరాజు, డీలర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి స్వచ్ఛంద సంస్థ చేయూత



సాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఒంటిమిట్ట, అక్టోబరు 2 : రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగి, నడుం దెబ్బతినడంతో సమస్యలు ఎదుర్కొంటున్న కొత్తమాధవరం గ్రామానికి చెందిన సాయి మధు సూదన్ కుటుంబానికి మనవూరి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేయూతనందించారు. దాతల సహాయంతో సేకరించిన రూ. 27,500 నగదు, 10 వేల విలువ చేసే నిత్యావసర సరుకులు, బియ్యం అందజేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ అవ్వారు రవిశంకర్, ఉప్పల రామకృష్ణ, పుత్తా సుధీర్‌రాయల్, టక్కోలు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు అన్నదానం

పెనగలూరు, అక్టోబరు 2 : మండలంలోని ఎగువ సిద్దవరం గ్రామానికి చెందిన జీఆర్ ఫౌండేషన్ అధినేత గోపిగారి రెడ్డయ్య మంగళవారం రాజంపేట పట్టణంలోని పలువురు యాచకులు, నిరుపేదలకు అన్నదానం చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో యాచకవృత్తి చేస్తున్నవారిని గుర్తించి నేరుగా వారివద్దకు వెళ్లి బిరియాని, నీళ్లబాటిళ్లు అందజేశారు. పట్టణంలో నిరుపేదలతో మగ్గిపోతున్న మరికొందరిని గుర్తించి వంట చెరకులతో పాటు ఆర్థికసాయం చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి


దీక్షలో పాల్గొన్న రైతు కార్మిక సంఘాల నాయకులు

-రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 2: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలు ఉపసంహరించుకోవాలని కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్ష శిబిరంలో వారు మాట్లా డుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయకుండా ప్రజలు నిరుద్యోగులు, కార్మికులు, ఐక్యంగా ఉద్యమించాలన్నారు. తొలగించిన 4 వేల మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యక్షులు రవికుమార్, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఎఫ్‌పీవో మృతి

చిట్వేలి, అక్టోబరు 2 : మరో రెండు రోజుల్లో చిట్వేలిలో బాధ్యతలు స్వీకరించనున్న ఏపీఎం ఎం.రవికుమార్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. రెండు రోజుల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్‌తో అమర్‌రాజా ఆసుపత్రిలో చేరినట్లు సిబ్బంది తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎక్సైజ్ శాఖ సీఐగా తులసి, ఎస్ఐ గా వరుణ్ కుమార్

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 2: రైల్వేకోడూరు ఎక్సైజ్ శాఖ సీఐగా టీ.కే. తులసి ఎస్ఐగా వరుణ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ తిరుపతి నుంచి, ఎస్ఐ మైదుకూరు నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడూరు మండలంలో 11, ఓబులవారిపల్లె మండలంలో నాలుగు, చిట్వేలి మండలంలో నాలుగు మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వివరాల కోరకు కోడూరు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా అధ్యక్షుడుగా జుబేర్

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 2: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ సౌత్ ఇండియా అధ్యక్షుడుగా షేక్ జుబేర్‌ను నియమించినట్లు జాతీయ చైర్మన్ గాజుల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం బెంగళూరులో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ తనకు బాధ్యతలను అప్పగించిన చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

రాజంపేట, అక్టోబరు 2 : విజయవాడలోని వరద బాధితులకు వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. విజయవాడలో వరద బాధితులకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోనేటి రవిరాజు, చరణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

సుండుపల్లె, అక్టోబరు 2: మండలంలోని రాయవరం క్రాస్ సమీపంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనరసయ్య బుధవారం తెలిపారు. బెస్తపల్లికి చెందిన ఖాదర్‌వలిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్

O.S. No. 83/2016

శ్రీ అంకాలమ్మ దేవస్థానం, రైల్వేకోడూరు రిప్రసెంటెడ్ బై ఇట్స్ చైర్మెన్, తోట అమరేంద్ర తండ్రి వెంకట కొండయ్య సెట్టి, హిందూ, ల్యాండ్-లార్డ్, బలిజ స్ట్రీట్, రైల్వేకోడూరు - వాది

V/s

దుగ్గిన వెంకటయ్య నాయుడు చనిపోయినందున అతని వారసులు నెం. 8 to 12 1) దుగ్గిన ప్రసాద్ S/o లేట్ వెంకటయ్య నాయుడు, 2) దుగ్గిన రవి ప్రసాద్ S/o లేట్ వెంకటయ్య నాయుడు, 3) దుగ్గిన సురేష్ ప్రసాద్ S/o లేట్ వెంకటయ్య నాయుడు, 4) దుగ్గిన రఘు ప్రసాద్ S/o లేట్ వెంకటయ్య నాయుడు, 5) దుగ్గిన వేణు ప్రసాద్ S/o లేట్ వెంకటయ్య నాయుడు - ప్రతివాదులు నెం. 8 to 12

ప్రతివాది సమన్లు నెంబర్ 8 to 12

వాది పై కోర్టు నందు ప్రతివాది నెం. 4 దుగ్గిన వెంకటయ్య నాయుడు మరియు ఇతరులు పై పైకోర్టు నందు పర్మినెంట్ ఇంజక్షన్ కోరుచూ దావా దాఖలు చేసియున్న, దుగ్గిన వెంకటయ్య నాయుడు చనిపోయినందున అతని వారసులు నెం. 8 to 12ను కోర్టువారు చేర్చిన్నారు వారికి సదరు కోర్టు ద్వారా కోర్టు సమన్లు పంపిన్నారు. పై వ్యక్తులు నెం. 8 to 12 తీసుకోనందున వారు పై కోర్టు నందు హాజరగు నిమిత్తము 16-10-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగాగాని లేదా లాయర్ ద్వారాగాని హజరై తెలుపుకొన వలెను. లేనియెడల మీ పైన పరోక్షముగా తీర్మానించబడునని తెలపడం అయినది.

(By order of the Court)

దాసరి నరసింహులు, అడ్వకేట్, నందలూరు.

ప్రజా దర్బార్‌తో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

చిన్నమండెం, అక్టోబరు 2: ప్రజా దర్బార్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు విన్నవించేందుకు అధిక సంఖ్యలో ప్రజా దర్బార్‌కు తరలివస్తున్నారు. ఉదయం 6 గంటలకే మంత్రి ఇంటి దగ్గరికి చేరుకొని వినతి పత్రాలతో బారులు తీరారు. మంత్రివర్యులు ప్రతి సమస్యను ఓర్పు, సహనంతో విని సమస్యలు పరిష్కరించేందుకు బాధితలకు హామీ ఇచ్చారు.

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం హరిజనవాడలో రోడ్డు రవాణా, యువజన , క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాదురెడ్డి బోరు వేయించి ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇప్పించారు బుధవారం బోరు ప్రారంభించి కొళాయిలకు నీరు వదిలారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద 20 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి అందులో నీరు నింపకుండా బిల్లులు తిన్నారని గ్రామస్తులు మంత్రికి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్ మోహన్ , చలపతి, వేణు, వెంకటేశ్వరులు, రామచంద్ర, సునీల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు

జాతిపిత మహాత్మా గాంధీ మార్గాన్ని అనుసరిద్దాం


గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ


మహాత్మాగాంధీకి వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగులు


నిరుపేదలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు2: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకొని భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి ప్రపంచ చరిత్రలో గొప్ప వ్యక్తిగా జాతిపిత నిలిచారని, ఆయన చూపిన మార్గం, సేవలు, ఆశయాలను మనమందరం స్మరించుకోవాలన్నారు. అలాంటి మహను భావుడి ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఎప్పటికీ ఆదర్శప్రా యమని, మంచి మార్గంలో నడవడానికి స్ఫూర్తిదాయకమని, బాపూజీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు మోటారు వాహనాల అధికారి (ఆర్ఐ) పెద్దయ్య, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ స్వతంత్రం సిద్ధించి 77 ఏళ్లు కావస్తున్నా ఇంకా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు రాలేదని, ఇప్పుడైనా నాయకులతో, అధికారులతో మాట్లాడమని వినతిపత్రం సమర్పించామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కిల్డ్ వర్కర్స్ స్కీం వర్కర్స్, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ రకరకాల పేర్లతో తమ జీవితాలతో ఆడుకుంటూ తమ జీవితాల్లో వెలుగులు లేకుండా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేసి, ఈపీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాలనికోరారు. జిల్లా కార్యదర్శి షేక్. అలీహుస్సేన్, సభ్యులు ప్రదీప్‌కుమార్, రెడ్డిలక్ష్మి, సాబిరున్, సమియున్ పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేటలోని పాతబస్టాండు నందు మహాత్మాగాంధీ, మాజీ ప్రధానమంది, భారతరత్న లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం ఎల్ఐసీ యూనియన్ నాయకులు ఆర్య వెంకట సుబ్బయ్య నాయుడు వారి ఆర్థిక సహకారంతో అల్పాహార వితరణ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల పార్లమెంట్ జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ మహాత్మాగాంధీ అహింసా మార్గం చూపిన గొప్ప నాయకుడని అన్నారు. భారతదేశానికి రెండో ప్రధానమంత్రిగా భారతీయులందరిలో దేశభక్తిని నింపిన గొప్ప దేశభక్తుడు, భారతరత్న లాల్‌బహదూర్‌శాస్త్రి అని, ఇరువురు మహనీయులను స్మరించుకోవడం భారతీయులుగా మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి వివి రమణ, పార్లమెంట్ నాయకులు తోట నగేష్, బీజేపీ పట్టణ కార్యదర్శి పెనుగొండ రమణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సూర్యచంద్ర, పట్టణ కార్యదర్శి సుబ్రమణ్యం, బీజేపీ నాయకులు రమణారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రైల్వేకోడూరు(రూరల్): పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో, పట్టణంలోని టోల్‌గేటు వద్ద కూటమీ నాయకులు మాజీ సైనికుల సంఘం సభ్యుల నివాళులర్పించారు. పంచాయతీ అధికారులు నౌషద్ బాషా, మాజీ ఉపసర్పంచ్ నార్జల హేమరాజ్, వార్డు సభ్యులు పోతురాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖను రద్దు చేయాలి


ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల నేతలు, కార్యకర్తలు

రాజంపేట, అక్టోబరు 3 : రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాలయాలను హిందూ ధార్మిక సంఘాలకు అప్పజెప్పి దేవదాయ ధర్మాదాయశాఖను పూర్తిగా రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, నాయకులు శ్రీనివాసులు నాయుడు, పోకల ప్రభాకర్, రెడ్డయ్యరాజు, సుధాకర్‌బాబు, పెంచల్‌రెడ్డి, భానుమూర్తిశర్మ, సాయిలోకేష్ డిమాండ్ చేశారు. తిరుమల మహాప్రసాదమైన లడ్డూ కల్తీ జరిగిన నేపథ్యంలో దేవాలయాల స్వయం ప్రతిపత్తి విషయంగా విశ్వహిందూపరిషత్ బుధవారం రాజంపేటలో మహా ర్యాలీ నిర్వహించింది. స్థానిక రోడ్లు, భవనాల అతిగిగృహం నుంచి ప్రారంభించి మార్కెట్, పాతబస్టాండు మీదుగా రైల్వేస్టేషన్ రోడ్‌మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పనిచేస్తున్న అన్య మతస్థులను ఉద్యోగాల నుంచి తక్షణం తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సత్సంగ్ ప్రముఖ్ లక్ష్మీనారాయణ, రాజంపేట ప్రఖండ సత్సంగ్ ప్రముఖులు గంగనపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సనాతన హైందవ ధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రిలే దీక్షలు..

రైల్వేకోడూరు(రూరల్) : సనాతన హైందవ ధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద విశ్వహిందూ పరిషత్ నియోజకవర్గ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల లడ్డులో జంతు నూనె ఉపయోగిస్తున్నారని వచ్చిన అభియోగంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆదునుకోట నర్సింహులు, ఎస్. మల్లికార్జున, మణి, బీజేపీ నాయకులు పులపుత్తూరి రామసుబ్బారెడ్డి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు మంచాలు, పరుపులు వితరణ

నందలూరు, అక్టోబరు 2 : నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్‌వారు బుధవారం మంచాలు, పరుపులు అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ పోలీసు ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ ఆసుపత్రి వైద్యులు, టీడీపీ నాయ కులు మోడపోతుల రాము, వాకర్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు సూచన మేరకు నాలుగు ఐరన్ మంచాలు, పరుపులు, దిండ్లు అందజేశామన్నారు. దాతలకు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శరత్‌కమల్, కార్తీక్‌విశ్వనాథ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువ ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కర్‌రావు, మన్యం రామ్మోహన్, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ కుర్రా మణియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పాలసీని సవరించాలి : ఏపీ మహిళా సమాఖ్య



గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

రాయచోటిటౌన్, అక్టోబరు 2: నూతన మద్యం పాలసీని సవరించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరోజనమ్మ, సుమిత్రమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్య క్షురాలు గంగారాణి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గాంధీజీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ మద్యం షాపుల సంఖ్య తగ్గించడంతో పాటు మద్యం విక్రయించే సమయాన్ని కూడా తగ్గించాలని కోరారు. మద్యపానం వల్ల కుటుంబ వ్యవస్థ పూర్తి స్థాయిలో ఛిన్నాభిన్నం అవుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని అనర్థాలకు కారణమైన మద్యాన్ని నిషేధించకపోగా, మరింత ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా దుకాణాలు పెంచడం, రూ.99లకే క్వార్టర్ సీసా అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించటం దారుణమైన విషయమని విమర్శించారు. మహిళలపై అఘాయిత్యాలకు మూల కారణమైన మద్యాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వాలు దానిని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపాలని, డీ అడిక్షన్ కేంద్రాలు పెంచాలని, ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం షాపులకు అనుమతివ్వాలని కోరారు. రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ వాటి ధరలు నియంత్రించకుండా మద్యం . ధరలను తగ్గించటం దేనికీ సంకేతమో వివరించాలన్నారు. తక్కువ ధరలకే నిత్యవసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. మద్యం విధానంపై ఎందుకు శ్వేతపత్రం విడుదల చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య లీడర్లు సుభాషిణి, వనిత, కృష్ణవేణి, లక్ష్మీదేవి, శంకరమ్మ, కనకమ్మ పాల్గొన్నారు.

శ్రీవారికి ఆలయానికి చేరుకున్న దర్భచాప, తాడు



శ్రీవారి ఆలయంలోకి ఊరేగింపుగా తీసుకొస్తున్న దర్భచాప, తాడు

తిరుమల, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భ చాప, తాడును బుధవారం డీఎఫ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రంగనాయక మండపంలోని శేషవాహనంపై ఉంచారు. శుక్రవారం సాయంత్రం జరిగే ధ్వజారోహణం సందర్భంగా రుత్వికులు వేదమంత్రాలతో దర్భచాపను ధ్వజస్తంభం చుట్టూ.. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలున్నాయి. తిరుమలలో వినియోగించే విష్ణు దర్భను ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో సేకరించారు. వారంరోజులు ఎండబెట్టి శుభ్రపరిచారు. 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో దర్భ చాప, 225 మీటర్ల పొడవైన తాడును సిద్ధం చేసి సమర్పించారు.

కంకణ భట్టాచార్యులుగా ఏఎస్ గోవిందాచార్యులు

బ్రహ్మోత్సవాలకు కంకణ భట్టాచార్యులుగా సీనియర్ అర్చకుడు ఏఎస్ గోవిందాచార్యులు వ్యవహరించనున్నారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో అర్చకుల్లో ఒక్కరిని కంకణ భట్టాచార్యులుగా నియమిస్తారు. ఈ క్రమంలోనే పూర్వం బ్రహ్మోత్సవాలతో పాటు వసంతోత్సవాలు వంటి కైంకర్యాలను విజయవంతంగా నిర్వహించిన గోవిందాచార్యులను ఈ ఏడాది కంకణభట్టాచార్యులుగా ఎంపిక చేశారు. అంకురార్పణ నుంచి చక్రస్నానం వరకు వాహనసేవలో, యాగశాలలోని వైదిక కార్యక్రమాలు, ఇతర పూజల్లో ఆయన ప్రధాన పాత్రపోషిస్తారు. ఉదయం, సాయంత్రం మడిని పాటిస్తూ నిత్యహోమాలు, ఇతర వైదిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు పొలిమేర దాటివెళ్లరు.

55 మంది అర్చకుల ఏర్పాటు

ఇక, ఉదయం, రాత్రి వాహనసేవలతో పాటు యాగశాల, గర్భాలయం, ఉప ఆలయాలు వంటి వివిధ ప్రాంతాల్లో కైంకర్యాల కోసం 55 మంది అర్చకులను ఏర్పాటు చేశారు. వీరితోపాటు వాహనసేవల్లో కొలువుదీరే ఉత్సవమూర్తులను అలంకరించేందుకు చెన్నై నుంచి ప్రత్యేకంగా మరో ఇద్దరు అలంకరణ భట్టాచార్యులు తిరుమలకు చేరుకున్నారు.

సామాన్య భక్తులకే పెద్దపీట

- బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన ఏర్పాట్లు
- 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో శ్యామలరావు



'ప్రస్తుతమున్న ఉన్నతాధికారులందరం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కొత్తే. అయినప్పటికీ గతంలో పనిచేసిన అధికారులు, మీడియా, భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాం. అన్నిటినీ పరిశీలించి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాం. స్వామి దర్శనం, వసతిలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం' అని టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ఈనెల 4న శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో ఈనెల 4 నుంచి 12వ తేది వరకు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. మూలవిరాట్టు దర్శనంతో పాటు వాహనసేవ దర్శనం సంతృప్తికరంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం. ఆలయంలోని క్యూలైన్లతో పాటు గ్యాలరీల్లోని భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడానికి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. గతంలో గరుడవాహనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తాయి? మరుగుదొడ్లు, తాగునీరు అందించడంలో ఎలాంటి సమస్యలు వచ్చాయి? గ్యాలరీల్లోకి రావడానికి, కూర్చోవడానికి భక్తులు పడిన ఇబ్బందులను తెలుసుకున్నాం. వాటిని అధిగమించేలా చర్యలు చేపట్టాం.

పెరటాసి రద్దీని తట్టుకునేలా..

తమిళ భక్తులకు ముఖ్యమైన పెరటాసితో పాటు బ్రహ్మోత్సవాలు కూడా రావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేశాం. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శనాలు రద్దు చేశాం. గరుడసేవకు ప్రొటోకాల్ దర్శనాన్నీ నిలిపేశాం. బ్రహ్మోత్సవాల రోజులకు సంబంధించి ఇప్పటికే 1.32 లక్షల దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో ఇచ్చాం. సర్వదర్శన టోకెన్లు రోజుకు 24వేల చొప్పున జారీ చేస్తాం. మామూలుగా 80 వేల మందికి దర్శనం చేయిస్తాం. కానీ బ్రహ్మోత్సవాల్లో రోజుకు 90 వేల నుంచి 95 వేల మంది దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశాం. మాడవీధుల్లోని గ్యాలరీల్లో 2 లక్షల మంది మాత్రమే కూర్చోగలరు. అదనంగా మాడవీధుల్లోని కార్నర్ క్యూలైన్ల ద్వారా దాదాపు 20 వేల మందికి వాహనసేవల దర్శనం చేయిస్తాం.

నడకదారి భక్తులకు...

అలిపిరి మార్గంలోని వచ్చిన వారికి గతంలో దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవారు. దాన్ని గతంలోనే రద్దు చేశారు. బ్రహ్మోత్సవాల తర్వాత ఆ విషయం ఆలోచిస్తాం. ప్రస్తుతం శ్రీవారిమెట్టు మార్గంలో వచ్చేవారికి దివ్యదర్శనం టోకెన్లు ఇస్తున్నాం. నడిచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రణాళికలు రూపొందించుకున్నాం.

60 వేల మందికి వసతి

తిరుమలలోని 7వేల గదుల ద్వారా 40 వేల మందికి వసతి లభిస్తుంది. యాత్రికుల వసతి సముదాయాల్లోని 68 హాళ్లద్వారా 7 వేల లాకర్లు ఉన్నాయి. వీటి ద్వారా 20 వేల మందికి వసతి కల్పించవచ్చు. ఇక, 411 బస్సుల ద్వారా 3వేల ట్రిప్పులతో ఆర్టీసీ సేవలందిస్తుంది. 4 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశాం. నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తాం.భక్తులకు ఇబ్బంది లేకుండా 7 లక్షల లడ్డూల బఫర్ స్టాక్ ఉంచుకున్నాం. లడ్డూ కౌంటర్లు 54 నుంచి 65కు కౌంటర్లను పెంచాం.

భక్తులకు భద్రత

తొలిరోజున సీఎం పర్యటనకు కూడా ఏర్పాట్లు పూర్తయ్యాయి. 3.5 లక్షల మంది భక్తులు గరుడసేవకు వస్తారని అంచనా. దానికి అనుగుణంగా అధికారులను, సిబ్బందిని సిద్ధం చేశాం. ఎక్కడా ఎక్కడ తోపులాటలు తొక్కిసలాటలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. 1,225 మంది విజిలెన్స్, 3,800 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. 2,770 సీసీ కెమెరాల ద్వారా నిఘా పెడుతున్నాం.

చంద్రబాబు తిరుమల పర్యటన ఇలా..

తిరుమల, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణకు శుక్రవారం సీఎం చంద్రబాబు తిరుమల రానున్నారు. సాయంత్రం 6.20 గంటలకు తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకుంటారు. సంప్రదాయ వస్త్రధారణలో రాత్రి 7.40 గంటలకు బేడిఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి వస్తారు. అక్కడ అర్చకులు చంద్రబాబుకు పరివట్టం చుట్టగా.. తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. మంగళవాయిద్యాల నడుమ 7.55 గంటలకు ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. ఆ సమయంలో జీయంగార్లు శేషవస్త్రాన్ని మెడలో ధరింపచేస్తారు. అక్కడ్నుంచి రంగనాయకుల మండపానికి చేరుకుని 2025 టీటీడీ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. 9.15 గంటలకు తిరిగి పద్మావతి విశ్రాంతి భవనం చేరుకుంటారు. శనివారం ఉదయం 7.30 గంటలకు పాంచజన్యం అతిథిగృహం వెనుకభాగంలో నిర్మించిన వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి 7.55 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీకి అస్వస్థత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 2: ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో కళ్లు తిరగడంతో యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. అదే సమయంలో వాంతులు కావడంతో వైద్యులు చికిత్స చేశారు. అత్యవసరంగా పరిగణించి వైద్యులు క్వార్టర్స్‌లోనే గంటపాటు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ చెక్ చేయగా నార్మల్‌గానే ఉన్నట్టు తెలిసింది. అయితే, గత రాత్రి తిన్న ఆహారం జీర్ణం కాకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడినట్లు సమాచారం. కళ్లు తిరగడానికి మూల కారణం స్పాండిలైటిస్ - వెర్టిగో సమస్యగా వైద్యులు చెప్పినట్టు తెలుస్తోంది. ప్రస్తుతానికి ఆరోగ్యం కుదుటపడినప్పటికీ మెడకు బ్యాండ్ వాడమని, రెండు రోజులు విశ్రాంతి అవసరమని తిరుపతి నగరంలోని ఓ ప్రముఖ న్యూరో హాస్పిటల్ వైద్యుడు సూచించినట్లు తెలుస్తోంది. అప్పారావును రిజిస్ట్రార్ భూపతి నాయుడు పరామర్శించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి,అక్టోబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది . మహాలయ అమావాస్య కావడంతో సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 848మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1,809మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,156మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 902, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 233మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 208మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 88మంది భక్తులు పూజలు చేయించుకున్నారు.

భారీ వర్షం



వర్షంలో వెళ్తున్న వాహనదారుడు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 2: నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా నగరవాసులు తీవ్ర అవస్థలకు లోనయ్యారు. సాయంత్రపు వేళల్లో విద్యార్థులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగులు, సిబ్బంది వర్షంలోనే తడుచుకుంటూ ఇళ్లకు వెళ్లారు.నగరంలోని మురుగు కాల్వలన్నీ పొంగి పొర్లడంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సహకార ఫ్యాక్టరీలను తెరిపించాలి



గాంధీ విగ్రహం ముందు దీక్ష చేస్తున్నరైతు వెంకటాచలం నాయుడు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 2: రైతులకు ఎంతగానో ఉపయోగపడే స్థానిక సహకార చక్కెర ఫ్యాక్టరీ, విజయం డెయిరీలను తెరిపించి జిల్లా రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని శాంతియుత ఉద్యమనేత, రైతు నాయకుడు వెంకటాచలం నాయుడు బుధవారం గాంధీ విగ్రహం ముందు దీక్ష చేపట్టారు. జిల్లాలో మూతబడిన సహకార ఫ్యాక్టరీలు తెరిపించడంతో పాటు, రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ముక్కంటి ఆలయ ఏఈవో ధనపాల్ సస్పెన్షన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: ముక్కంటి ఆలయ ఏఈవో ధనపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాలు జారీ చేశారు. ఆలయ ఈవోగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ ఇటీవల పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గోశాలను బుధవారం ఉదయం పరిశీలించారు. గోశాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది వైఫల్యాలను గుర్తించారు. గోశాల ఏఈవో ధనపాల్ పర్యవేక్షణ విఫలంతో వందలాది గోవులకు ప్రాణాంతక సమస్య ముప్పు వాటిల్లుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో ఏఈవోగా ధనపాల్ ఆలయం తరపున ఏర్పాటు చేసిన విభూది విక్రయ కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడినట్లు విచారణ ద్వారా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయ ఉద్యోగి గంగాధరం సతీమణి పేరుతో విభూది విక్రయ టెండర్‌ను దక్కించుకోవడంలో ధనపాల్ పాత్ర ఉందని.. అందులో సంప్రదాయాలకు విరుద్ధంగా ప్లాస్టిక్ ప్యాకింగ్ ఉపయోగించడం, అలాగే టెండర్లకు విరుద్ధంగా అదనపు వస్తువులను కౌంటర్‌లో విక్రయించడం, దాంతో పాటు టెండర్ షరతులను ఉల్లంఘిస్తూ కౌంటర్‌లో విక్రయించే వస్తువులపై ముక్కంటి ఆలయ దేవతా మూర్తుల బొమ్మలను ముద్రిదంచడం వంటి చర్యలను ఈవో తప్పు పట్టారు. ఏఈవో ధనపాల్ పర్యవేక్షణలో 9 వైఫల్యాలను పొందుపరుస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఇతని బాధ్యతలను డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డికి అప్పగించారు.

శ్రీవారిని స్మరిస్తూ..

50 నిమిషాల పాటు ఆలయంలో గడిపిన పవన్



ఆలయం ముందు వస్తూ..



అన్నప్రసాదం స్వీకరిస్తున్న పవన్

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీసీఎం హోదాలో తొలిసారిగా తిరుమలకు వచ్చిన పవన్‌కల్యాణ్ శ్రీవారిని స్మరిస్తూ ఆలయంలో 50 నిమిషాలు గడిపారు. బుధవారం ఉదయం 10.15 గంటలకు తన ఇద్దరు కుమార్తెలు ఆద్య, పొలెనా అంజనతో కలిసి మహద్వారం వద్దకు చేరుకోగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకులు స్వాగతం పలికారు. క్యూలైన్ ద్వారా వచ్చిన దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయితో కలిసి స్వామిని దర్శించుకున్నారు. 10.55 గంటలకు రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. 11.05 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చిన ఆయన.. మాడవీధులో నడుచుకుంటూనే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. కొందరు భక్తులతో మాట్లాడి తానూ వారితో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. చాలా రుచిగా ఉందంటూ ప్రశంసించారు. అన్నప్రసాదాల నాణ్యతను పెంచేందుకు తీసుకున్న చర్యల గురించి అదనపు ఈవో వెంకయ్య చౌదరి, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి వివరించారు. మధ్యాహ్నం నుంచి ఆయన అతిథిగృహానికే పరిమితమయ్యారు. ధ్యానంలో గడిపారు. శుక్రవారం జపాలి ఆంజనేయస్వామిని దర్శించుకుని.. సాయంత్రం తిరుపతిలో జరిగే వారాహి సభలో పాల్గొననున్నారు. భక్తులకు ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశ్యంతో పవన్ మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. దీక్షలో ఉన్న పవన్ కాలినడకన తిరుమలకు రావడంతో చాలా నీరసంగా కనిపించారు. ఎవరితోనూ పెద్దగా మాట్లాడలేదు. పవన్‌తో పాటు ఎంఎల్సీ హరిప్రసాద్, ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, ఆరణి శ్రీనివాసులు, స్థానిక నేతలు పసులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి తదితరులు శ్రీవారిని దర్శించుకున్నారు.

200మంది విద్యార్థులకు రూ. 40 లక్షల ఉపకార వేతనాలు



ట్రస్టుకు రూ.50లక్షల చెక్కును అందిస్తున్న గల్లా అరుణ తదితరులు

పూతలపట్టు, అక్టోబరు 2: పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడమే కృష్ణదేవరాయ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ధ్యేయమని మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి అన్నారు. పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో బుధవారం అసోసియేషన్ 49వ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ తన తండ్రి పాటూరి రాజగోపాల నాయుడు స్ఫూర్తితో ట్రస్టును ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల తాను రచించిన స్వీయ చరిత్ర పుస్తకం 5వేల కాపీలు అమ్మడం ద్వారా వచ్చిన రూ.50 లక్షలను ట్రస్టుకు విరాళంగా అందిస్తున్నానన్నారు. అమరరాజా సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ 1968లో వెయ్యి రూపాయల పెట్టుబడితో ట్రస్టును స్థాపించగా నేడు వంద కోట్లకు చేరిందని, ఈ నిధులను విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ గౌరినేని రమాదేవి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, సీఏ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 200 మంది విద్యార్థులకు రూ.40 లక్షల ఉపకార వేతనాలను అందించారు. టీటీడీ పూర్వ జేఈవో శ్రీనివాసరాజు, పీఈఎస్ యూనివర్శిటీ చాన్సలర్ జవహర్ దొరస్వామి, ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, సాహితీ ప్రముఖుడు సాకం నాగరాజ, అసోసియేషన్ కార్యదర్శి గల్లా విజయ్ నాయుడు, సభ్యులు మహదేవ నాయుడు, సతీష్, రాళ్లపల్లె, గల్లా రాజశేఖర్, బాలాజీ కిరణ్, ఉమాకాంత్, సర్పంచ్ గల్లా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిలో టమోటా రూ.56.70

పుంగనూరు రూరల్, అక్టోబరు 2: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం కిలో టమోటా రూ. 56.70 పలికింది. మొదటి రకం రూ.56.70, రెండోరకం రూ.53.40. మూడో రకం కిలో ధర రూ.50 చొప్పున యార్డుకు వచ్చిన 14.71 మెట్రిక్ టన్నుల టమోటాను వ్యాపారులు కొనుగోలు చేశారు.

కొత్త చౌక దుకాణాలా.... ఆగండి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 2: జిల్లాలో రేషన్‌కార్డుల విభజన, కొత్త చౌక దుకాణాల ఏర్పాటుకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కార్డుదారుకు దగ్గరలోనే చౌకదుకాణాల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం గత 15 రోజులుగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పంచాయతీలు, పట్టణాలు నగరపాలక సంస్థల పరిధిలో ఒక్కో చౌకదుకాణం పరిధిలో కార్డుల సంఖ్య సమానంగా చేసి డీలర్లు, కార్డుదారులకు మేలు చేయాలని సంకల్పించింది. ఈ ప్రక్రియను రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు దాదాపు పూర్తి చేశారు. కొత్తగా 49 దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాజీనామాలు, వివిధ కారణాలతో తొలగించడంతో 400కు పైగా దుకాణాలకు నాలుగేళ్లుగా డీలర్లు లేరు. వీటిని అప్పటి వైసీపీ ప్రతినిధులు ఇన్‌చార్జీల పేరుతో మరికొన్ని షాపులను ఎస్‌హెచ్‌జీ గ్రూపులు నిర్వహిస్తున్నారు.శాశ్వతంగా డీలర్ల భర్తీకి నలుగురు ఆర్డీవోలు నోటిఫికేషన్ ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని పౌరసరఫరాల కమిషనరేట్ నుంచి జిల్లాకు మంగళవారం ఉత్తర్వులు అందాయి. ఈ ప్రక్రియలో ఉన్న లోపాలు సరిదిద్ది అందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. డీలర్ల వినతిని పూర్తి స్థాయిలో పరిశీలించి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు డీఎస్వో శంకర్ బుధవారం తెలిపారు.దీంతో మరికొన్ని రోజులు ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ సరుకుల పంపిణీ కొనసాగనుంది.

పౌరుల భాగస్వామ్యంతోనే సంపూర్ణ పారిశుధ్యం

● కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

చిత్తూరు, అక్టోబరు 2: నగర పౌరుల భాగస్వామ్యంతోనే సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో నగరంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో రెండు వారాల పాటు స్వచ్ఛతా హీ సేవ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు నగరాభివృద్ధికి తోడ్పాటుని చేవారిని కలుపుకుని పోతామన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సిబ్బంది, అధికారులు స్వచ్ఛతా హీ ప్రతిజ్ఞ చేసి మానవహారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మేయర్ కఠారి హేమలత, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాళెం పంచాయతీలో ఏనుగుల విధ్వంసం

● వరి, మామిడి, టమోటా పంటలకు అపార నష్టం



కొంగరవారిపల్లి సమీపంలో వరి పంటను ధ్వంసం చేసిన ఏనుగులు - ఏనుగుల దాడిలో నేల రాలిన మామిడికాయలను చూపుతున్నరైతు సుబ్రమణ్యం

కల్లూరు, అక్టోబర్2: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ పరిధిలోని పంట పొలాల్లో మంగళవారం రాత్రి ఏనుగులు విధ్వంసం సృష్టించాయి. దీంతో వరి, టమోటా, మామిడి పంటలకు అపారనష్టం వాటిల్లింది. మంగళవారం అర్ధరాత్రి సుమారు పది ఏనుగుల గుంపు కొంగరవారిపల్లి సమీపానికి చేరుకుంది. రైతులు సురేంద్రనాయుడు, వెంకట్రామానాయుడుకు చెందిన ఎకరా వరి పంటను ధ్వంసం చేశాయి. ఇదే గ్రామానికి చెందిన రైతులు రామనాథంనాయుడు, అశోక్‌నాయుడు పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. అక్కడినుంచి గుట్టమీదపల్లి, జూపల్లి మీదుగా కోటపల్లి వద్దకు చేరుకొని ఘీంకారం చేశాయి. కోటపల్లిలోని రైతు హరికి చెందిన ఎకరా టమోటా పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఆపై రైతు సుబ్రమణ్యంకు అటవీ సరిహద్దులో రెండు ఎకరాల మామిడితోట ఉంది. ఆన్ సీజన్‌లో సుమారు నాలుగు టన్నుల కాయలు కాయడంతో ఆ రైతు ఆనందానికి అవధుల్లేవు. సుమారు రూ.3లక్షలు ఆదాయం వస్తుందనుకుంటున్న సమయంలో ఏనుగులు మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. దీంతో సుమారు టన్ను మామిడికాయలు నేలరాలగా, సుమారు 60 మామిడి చెట్లను ఏనుగులు విరిచేశాయని ఆ రైతు లబోదిబోమన్నాడు. ఏనుగుల గుంపు దాడి చేసిన పంట పొలాలను మంగళంపేట ఎఫ్‌బీవో మున్నా పరిశీలించారు. పంటల నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు.

సంక్షోభంలో చేనేత రంగం

- ముడిసరుకు ధరలెక్కువ.. తయారైన పట్టు చీరలకు డిమాండ్ తక్కువ
- పూట గడవక.. బిడ్డలకు చదువు ఇప్పించలేక ఆర్థిక ఇబ్బందుల్లో నేత కార్మికులు
- ఆదుకోవాలని ప్రభుత్వాలకు వినతి





మదనపల్లె అర్బన్, అక్టోబరు 2: మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెకు సిల్క్‌టౌన్‌గా ఏపీ రాష్ట్రంలోనే పేరొందింది. ఇక్కడ చేనేత రంగంతో పాటు అనుబంధ రంగాల్లో 20 వేల మందికిపైగా కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం చేనేత రంగం సంక్షోభంలో ఉందని, ప్రభుత్వాలు ఆదుకోవాలని చేనేత కార్మికులు వేడుకొంటున్నారు. బిడ్డల చదువులు పక్కన పెడితే పూట గడవడమే కష్టతరంగా మారింది. ముడిసరుకుల ధరలెక్కువ దానితో తయారైన పట్టు చీరలు రేట్లు తగ్గిపోవడంతో పట్టు చీరల వ్యాపారాలు స్తబ్దుగా నిలిచిపోయాయి. పట్టు చీరలు డిమాండ్ లేకపోవడంతో ఎగుమతులు ఆపేశారు. అరకొర వ్యాపారాలు, అందులోను ముడి సరుకు కొనుగోలు చేయలేని పరిస్థితిలో చేనేత మగ్గాల యాజమాన్యం ఉండడంతో చేనేత కార్మికులు పని దొరకక ప్రత్యామ్నాయ పనులు మేస్త్రి పనులు, టమోటా మార్కెట్‌లో కూలీలుగా మారిపోతున్నారు. చేనేత మగ్గాల యాజమాన్యం నష్టాలు రావడంతో అవి మానేసి వేరువేరు వ్యాపారాల్లో నిమగ్నమౌతున్నారు. తమ పిల్లలకు నాణ్యమైన చదువులు ఇప్పించలేని పరిస్థితి నెలకొంది. ఇందులో ముడి సరుకు సిల్క్ కిలో రూ.4500 పలుకుతుంది. దానికి తోడు రంగులు అద్దకం, వార్పులు వేయడం తదితర కూలీలు పెరిగిపోవడంతో చేనేత రంగం కుదేలు అవుతోంది. ఒక పట్టు చీర తయారు చేసిన తరువాత అన్ని లెక్కలు చూస్తే చీరపై రూ. 500 కూడా గిట్టుబాటు రావడంలేదని యాజమాన్యం వాపోతున్నారు. ఉన్న చేనేత కూలీలతో పట్టు చీరలు నేసినా అమ్మకాలు లేక ఇంట్లోనే ఉంచుకోవాల్సి వస్తోంది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సిల్క్ సబ్సిడీపై చేనేత కార్మికులకు గుర్తింపు పుస్తకాల ద్వారా అందించేవారు. వ్యక్తి రుణాలు చేనేత కార్మికులకు సబ్సిడీపై లక్ష నుంచి 5 లక్షల వరకు అందించేవారు. తయారైన పట్టుచీరలు ఎగుమతులు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుత పరిస్థితిల్లో చేనేత కార్మికులకు ఇస్తున్న అన్ని రాయితీలు తొలగించడంతో కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి. ఆప్కో వారు పట్టు చీరలను కొనుగోలు చేసేవారు. చేనేత కార్మికులకు సొసైటీల ద్వారా అన్ని సౌకర్యాలు, సబ్సిడీలు అందించేవారు. అందులోను మరమగ్గాలు అందుబాటులోకి వచ్చినందున నేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. చేనేత కార్మికులకు ప్రభుత్వాలు ఆర్థికసాయం చేయాలని, బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముడిసరుకులకు రాయితీ కల్పించాలని చేనేత కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అన్ని విధాల చేనేత కార్మికులను ఆదుకుని చేనేత రంగాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాని ప్రభుత్వాలను కోరుతున్నారు. రాజకీయాల కోసం చేనేత కార్మికులను వాడుకొంటున్నారే తప్ప ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు. రాజకీయ నాయకులు చేనేత కార్మికులకు ఏమాత్రం ఉపయోగపడలేదన్నారు.

నేతన్న నేస్తం లాంటి పథకాలను ప్రభుత్వం అమలు చేయాలి..



చేనేత కార్మికుల అభివృద్ధిని ఆకాంక్షించి ప్రభుత్వం నేతన్న నేస్తం లాంటి పథకాలను అమలు చేయాలని, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. అప్పుడే చేనేత రంగం సంక్షోభం నుంచి వైతొలుగుతుంది.

- ఎం. రామ్మోహన్, చేనేత కార్మిక సంఘం యూనియన్ ఉపాధ్యక్షుడు, నీరుట్టువారిపల్లె

చేనేత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయాలి..

చేనేత కార్మికుల ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ముడిసరకులు సబ్సిడీ ధరలకే విక్రయించాలి. చేనేత కార్మికుల సొసైటీలు ఏర్పాటు చేయాలి. చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడకుండా చర్యలు చేపట్టాలి.

- మోడెం నాగరాజ, చేనేత సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు, గజ్జలకుంట, మదనపల్లె

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కమిషనర్ పల్లవి

బి.కొత్తకోట, అక్టోబరు 2: బి.కొత్తకోట నగర పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులను కమిషనర్ జీఆర్ పల్లవి బుధవారం ఘనంగా సన్మానించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కాలేజి, జడ్పీ హైస్కూల్ తదితర ప్రదేశాలలో జరిగిన పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయ ఏవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన స్వర్ణకుమారి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 2: మహిళా అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, కోళ్లబైలు గ్రామం, జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారిని తమ ఇంటి ముందర వెంకటేష్‌తో కలిసి గత నెల 29 శనివారం ఉదయం బైక్‌పై పుంగనూరు రోడ్డులో స్వామి వద్దకు వైద్యం కోసం అని తీసుకెళ్లారన్నారు. ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదని. కుటుంబసభ్యులు పిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకి తెలిసిన వారు సీఐ తాలుకా 9440796742, ఎస్ఐ నెంబర్ 9440796743కు ఫోన్ చేయాలని సూచించారు.

పేదల ఇళ్లు కూల్చడం దారుణం

ములకలచెరువు, అక్టోబరు 2: పేద ముస్లీంల ఇళ్లను పోలీసులు కూల్చడం దారుణమని జాతీయ ఏసీబీఐ ఇన్‌చార్జి సయ్యద్‌మీర్ సాహెబ్, శ్రీ సత్యసాయి జిల్లా కదిరి కాంగ్రెస్ ఆరీఫ్ అలీ పేర్కొన్నారు. ములకలచెరువులో బుధవారం జరిగిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ పోలీస్ క్వార్టర్స్ స్థలమని ఇటీవల అక్రమంగా ఇళ్లు కూల్చారన్నారు. ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారులు బాధితుడైన ఫకృద్దీన్ పట్టా ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి ఆన్‌లైన్ వన్‌బీ కూడా ఉందన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్రమంగా స్థలంలో ప్రవేశించి దౌర్జన్యంగా కట్టడం తొలగించి ట్రెంచ్ వేశారన్నారు. అక్రమంగా కట్టడం తొలగించిన పోలీసులపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కదిరి కాంగ్రెస్ యూత్ లీడర్ మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజన పనులు చేపట్టాలి

పెద్దమండ్యం, అక్టోబరు 2: మహాత్మాగాంధీ ఉపాధి పథకం ద్వార రైతు ప్రయోజన పనులు చేపట్టాలని పెద్దమండ్యం ఉపాధి ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి పేర్కొన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీ కేంద్రాలలో బుధవారం ఉపాధి పథకం మొదటి గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరం మధ్య జరుగునున్న పనులు గుర్తించాలన్నారు. గ్రామీణ మట్టి రోడ్లు, చెరువు కట్టల అభివృద్ధి పనులు గుర్తించాలన్నారు. వారం రోజులలో ఉపాధి పనుల ప్రణాళిక సిద్ధం చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు.

ఉపాధి పనులపై గ్రామ సదస్సు

రామసముద్రం, అక్టోబరు 2: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులపై ఉపాధి హామీ పథక సిబ్బంది గ్రామ సభ నిర్వహించారు. పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలోని గ్రామ సచివాలయంలో బుధవారం సర్పంచ్ రెడ్డెప్పనాయుడు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈకార్యక్రమాలలో సర్పంచ్ రెడ్డెప్పనాయుడు, సెక్రటరీ భానుమూర్తి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పీలేరు, అక్టోబరు 2: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ చాన్ బాషా కుటుంబానికి స్థానిక బిస్మిల్లా ఆటో యూనియన్ కార్మికులు తమ వంతు సాయంగా రూ.10 వేలు, పలు నిత్యావసర సరుకులు అందజేశారు. పీలేరు పోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు బోడేషావలి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోధనాస్పత్రిలో కార్పొరేట్ సేవలు అందించేలా చూడాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు2: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో కార్పొరేట్ దిశగా సేవలు అందించడానికి అందరూ బాధ్యత గా పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మంగళవారం మదనపల్లె బోధనాస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందితో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్వరూ పని వారు బాధ్యతగా నిర్వహిస్తే ప్రతి రోజు వెయ్యి మందికిపైగా వచ్చే రోగులకు సేవలను అందించవచ్చని పేర్కొన్నారు. మెటర్నిటి కోసం వచ్చిన వారికి చాలా వరకు నార్మల్ అయ్యేల చూడాలని శస్త్రచికిత్స శాతం తగ్గేలా చూడాలని సూచిం చారు. మెటర్నిటీ వార్డుల్లో ఐదుమంది డాక్టర్లు ఉన్నారని, కేసులు ఎక్కువగా వస్తున్నా యని ఇక ఇద్దరి డాక్టర్ల అవసరం ఉందని చెప్పారు. ఇక ఏమైన సమస్యలు ఉంటే సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెం డెంట్ ఎంఎస్ రాజు, ఆర్ఎంవో ప్రసాద్‌రాజు,సర్వజన బోధనాపత్రి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అపర్ణ, డాక్టర్లు, టీడీపీ నాయకులు షంషీర్, కమలమరికృష్ణ, హరి పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలపై ప్రమాణానికి సిద్ధం



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు

ములకలచెరువు, అక్టోబరు 2: తనపై కొందరు చేసిన తప్పుడు ప్రచారాలపై సంగమే శ్వరస్వామి ఆలయంలో ప్రమాణానికి సిద్ధమని తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న తనపై కావాలని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. దమ్ముంటే తనపై చేసిన ప్రచారాన్ని నిరూపించాలన్నారు. మరో సారి తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరు కోనన్నారు. ఈ సమా వేశంలో టీడీపీ నేతలు తులసీధర్‌నాయుడు, తుమ్మచెట్ల సూరి, విశ్వనాధరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే నల్లారి కిశోర్ ధ్యేయం

వాల్మీకిపురం, అక్టోబరు 2: పీలేరు నియోజకవర్గంలో నిరుపేదల సంక్షేమమే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధ్యేయమని వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక మార్కెట్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతూ గత వైసీపీ పరిపాలనలో నియోజకవర్గంలో కుంటుపడ్డ అభివృద్ధి పనులన్నింటిని పూర్తి చేసే దిశగా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమాలలో పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, మండల ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, నాయకులు రాజేంద్రాచారి, చంద్రమౌళి, శేషాద్రి రెడ్డి, రమేష్, మురళి, ఆనంద్, జావీద్, సాదిక్, మున్వర్, మైనార్టీ యువత పాల్గొన్నారు.

కురవంక అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నాం



కురవంక బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ చలపతి

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: మదనపల్లె మండలంలో కురవంక పంచాయతీ అభివృద్ధే.ధ్యేయంగా కృషి చేస్తున్నామని సర్పంచ్ చిప్పిలి చలపతి పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభ నిర్వహించి, ప్రజలతో చర్చించారు. ప్రజాసమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అనంతరం కురవంక ప్రాథమిక పాఠశాల నుంచి మద నపల్లె రెడ్డీస్‌కాలనిలోకి వెళ్లేందుకు రూ.10లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి చలపతి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షబానా, ఉపసర్పంచ్ భారతి, వార్డు సభ్యులు నాగరాజు, కృష్ణమూర్తి, లోకేశ్, మున్నీబేగం, టీడీపీ నాయకులు మురళి, స్థానికు లు శ్రీనివాసులు, రైల్వే రమణ, షఫి, పునీత్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లైస్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్‌కు ఘనసన్మానం



పర్వీన్‌తాజ్‌ను సన్మానిస్తున్న పీటీఎం మండల టీడీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 2 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా నియ మితులైన ఎస్.ఎం పర్వీన్‌తాజ్‌ను బుధవారం పీటీఎం మండలానికి చెం దిన టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఆమె పార్టీలో సేవలందిస్తూ రాష్ట్ర స్థాయిలో కీలక పదవిని పొంది అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపును ఇస్తున్నారనడానికి ఆమె ఒక నిదర్శనమన్నారు. పీటీఎం మండల టీడీపీ నాయకులు పట్టా చంద్రమోహన్‌రెడ్డి, కుందిలి వెంకటరెడ్డి, పోతుపేట. వెంకటరెడ్డి, చిన్నపొంగుపల్లె ఆంజనేయరెడ్డి, పోతుపేట మధుసూదన్‌రెడ్డి బూచిపల్లె రమణ పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు తీయిస్తాం

- సీసీరోడ్లకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

నిమ్మనపల్లి, అక్టోబరు 2: మండలంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధిని పరుగులు తీయిస్తామని ఎమెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక పంచాయతీలోని పెద్దరాజులపల్లి, తవళం పంచాయతి ఉంటావారిపల్లో సీసీ రోడ్లకు సంబంధిత సర్పంచులు పాపులమ్మ, రెడ్డెప్పల ఆద్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలానికి రూ. 2.4కోట్లుతో సీసీ రోడ్లు మంజూరు అయినట్లు తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. అనంతరం పెద్దరాజులపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకొని అందులో పంటలు వేశారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆ భూమిని పరిశీలించి ఆయన రెవెన్యూ అధికారులు సర్వే చేసి పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, సుదాకర్‌రావు, చంద్రశేఖర్, మల్లప్ప లక్ష్మన్న, విజయ్, చెంద్రాయుడు, చినబాబు. శ్రీపతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె అర్బన్ అక్టోబరు2: మదనపల్లెలో బుధవారం నుంచి ఈ నెల 11 వరకు దసరా మహోత్సవాలు పలు ఆలయాల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓం ప్రకాష్, ఆర్యవైశ్య అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలు, అర్చనలు, విశేష పూజలు, అన్నదానం నిర్వహిస్తామన్నారు. స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో బుధవారం నుంచి దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రామిశెట్టి రత్నమయ్య, ట్రెజరర్ తెలిపారు. విద్యుత్ అలంకరణలతో ఆలయం శోభాయానుమానంగా అలంకరించారు. కోర్టు ఆవరణలో వెలిసిన కోర్టులో గంగమ్మకు విజయదశమి పురస్కరించుకుని దేవీ నవరాత్రుల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేపసినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. దేవతానగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో దసరా సందర్భంగా విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పతాంజలీ స్వామి తెలిపారు. స్థానిక అనపగుట్టలోని అభయ లక్ష్మీనరసింహా ఆలయంలో అమ్మవారికి దసరా సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు రమేష్ తెలిపారు. నేటి నుంచి 12 వరకు పూజలు ఉంటాయన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



వాల్మీకిపురంలో నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శివాలయం

వాల్మీకిపురం, అక్టోబరు 2: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. స్థానిక కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, బజారు వీధిలోని వాసవీ అమ్మవారి ఆలయం, బైపాస్ రోడ్డులోని నలవీర గంగాభవాని అమ్మవారి ఆలయం, మండలంలోని చింతపర్తిలోని వాసవీ ఆలయం, గండబోయనపల్లెలోని సత్యమ్మ తల్లి దేవత ఆలయాలలో గురువారం నుండి 9రోజుల పాటుగా ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

రేణుక యల్లమ్మ ఆలయంలో ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 2 : మండలంలోని రంగసముద్రం గ్రామంలో వెలసిన రేణుక యల్లమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నట్లు రంగసముద్రం గ్రామస్థులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా దసరా మహోత్సవాలను నిర్వహించేందుకు గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. ఈనెల 12వ తేదీ వరకు అమ్మవారిని సుందరంగా అలంకరించి దేవి నవరాత్రిపూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహ కులు తెలిపారు.

ఘనంగా అంకురార్పణ



గుర్రంకొండ, అక్టోబరు 2:గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి అంకురార్పణను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు. సాయంకాలం కలశాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో అందరికీ న్యాయం

గుర్రంకొండ, అక్టోబరు 2:తెలుగుదేశం పార్టీతోనే పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం జరిగిందని రాజంపేట పార్లమెంటరీ టీడీపీ మైనారిటీ ప్రధాన కార్యదర్శి నౌషాద్ అలీ అన్నారు. మండలంలోని తరిగొండలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టింద న్నారు. నాయకులు చంద్రబాబు, నారాయణ, ధరణి, రమణ పాల్గొన్నారు.

జాతిపిత మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం



మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్మికులకు శాలువకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ ఛైర్‌పర్సన్ మనూజ, కమిషనర్ ప్రమీల, డీఎల్‌డీవో లక్ష్మీపతి, కౌన్సిలర్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహానికి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీని అదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లోని అదికారులు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లోని కార్యాలయాల్లో బుధవారం గాంధీజయంతిని పురష్కరించుకుని గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహమూద్, ఎంపీడీవో కేఎస్ బాలాజీ లు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,రంగసముద్రం గ్రామ సచివాలయ పరిధిలో స్వచ్ఛతా హే కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులతో కలిసి గ్రామ నడక, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించి పురవీధులను శుభ్రం చేశారు. పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శివ, కార్యదర్శి కొండా శివప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను బుధవారం గుర్రంకొండలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీజి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కలకడలో:కలకడ మండలంలో బుధవారం గాంధీ జయంతి ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషిత్ కార్యాలయంలో సిబ్బంది గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈవోఆర్డీ లతీప్‌ఖాన్, ప్రతాప్‌రెడ్డి, బాషామొద్దీన్ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాలలో సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం, డాక్టర్లు సోని, శివాని, హర్షితరెడ్డి, రవికుమార్, శ్రీలక్ష్మి, మాజీ బార్ అధ్యక్షుడు విభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాసులు, నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: గాంధీజీ కలలకు కన్న రాజ్యం రావాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని మహాత్ముడికి ఆయనతోపాటు ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు

కురబలకోటలో: జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయ సాధనకు పాటుపడాలని ఎంపీడీవో హరినారాయణ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో, తహశీల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రదీప్‌కుమార్ తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెద్దమండ్యంలో: మహాత్మాగాంధీ జయంతి వేడుకలు బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా జరుపుకున్నారు. పెద్దమండ్యం మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి, ఈవోఆర్డీ జనార్ధన, సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రంలో: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి రోజును పురష్కరించుకుని మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో గాంధీ చిత్రపటానికి పూజలు చేసి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. మూగవాడిలో పంచాయతీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి గ్రామ వీధులలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈకార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, రాధాకృష్ణ, ఆనందరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలను ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరిలో: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సైనిక్ స్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రాస్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకింగ్ ఆఫీసర్ కె.స్వామినాథన్, జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ వాంఖడే, నాన్ కమిషన్డ్ ఆఫీసర్ రవీందర్, శ్రీశైలం, బలరామ్, శివ, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని బుధవారం పీలేరు మండలంలో ఘనంగా నిర్వ హించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రైవేటు కార్యాలయాలు, ఆసుపత్రులతో మహాత్ముని చిత్రపటాలను ఆవిష్కరించి అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీ య పార్టీల నాయకులు, విద్యార్థులు పూలమాలలతో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు శ్రీనాథరెడ్డి, రహంతుల్లా, షౌకత్‌అలీ, సందీప్, కేజీఎస్ రెడ్డిబాషా, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం బి.కొత్తకోటలో ఘనంగా జరుపుకు న్నారు. నగరపంచాయతీ కార్యాలయంలో కమిషనర్ జీఆర్ పల్లవి, ఆదిత్యకళాశాలలో ప్రిన్సిపాల్ యల్.ప్రసాద్, వాకర్స్ ప్రాంగణంలో క్రిష్ణారెడ్డి లు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నగరపంచాయతీ, ఆదిత్యకళాశాల సిబ్బంది, వాకర్స్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



సబ్-జైలులోని భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి మహేశ్

పీలేరు, అక్టోబరు 2: సమాజంలోని ప్రతి పౌరుడూ మహాత్ముని ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పీలేరులోని 11వ అదనపు జిల్లా జడ్జి మహేశ్ తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆయన పీలేరులోని సబ్-జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడుతూ పరివర్తన కోసం రిమాండు విధిస్తుంటారని, ఆ సమయంలో మహాత్ముని ఆశయాలు, బోధనలను స్మరించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన సబ్-జైలు పరిసరాలు, వంటశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎస్ఐ బాలకృష్ణ, న్యాయవాది షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరనాయక్

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరనాయక్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక సబ్‌జైలు లో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రిమాండ్‌లో వున్న ఖైదీలలో బెయిల్ పొందేం దుకు మండల న్యాయసేవా సంస్థ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఖైదీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెం డెంట్ రామకృష్ణ, పారా లీగల్ సుబద్ర, న్యాయసేవా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు ఖైదీలకు బెయిల్ ఇప్పిస్తాం

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: మదనపల్లె సబ్ జైలులో రిమాండ్‌లో వున్న నలుగురు ఖైదీలకు బెయిల్ ఇప్పించేందుకు న్యాయవాదులతో సంప్రదిస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా జలవనరులశాఖ ఏఈ బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 120 మంది ఖైదీలకు కేక్‌లు, ఆపిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖైదీల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, టీడీపీ నాయకులు ఎస్ఏ మస్తాన్, రఘుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు హాలును వినియోగంలోకి తీసుకొస్తాం



సబ్‌కలెక్టరేట్‌లోని కోర్టు హాలును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, అక్టోబరు 2: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లోని కోర్టు హాలును వినియోగంలోకి తీసుకొస్తామని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టరేట్ ఆవరణలోని కోర్టు హాలును సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైళ్ల దహనం తరువాత సబ్‌కలెక్టరేట్ పరిపాలన భవనాన్ని తాము స్వాధీనం చేసుకున్నామని, ఇందులో భాగంగా కోర్టుహాలును సిద్ధం చేసి ప్రతి శనివారం ఆర్‌వోఆర్ అప్పీళ్లను విచారిస్తామన్నారు. సబ్‌కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.